ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 7 ఆగస్టు 2025



ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీలో విచారణ చేస్తున్న మైన్స్ సేఫ్టీ అధికారి కణ్ణన్, డీఎంస్, డీడీఎంస్

గ్రానైట్ క్వారీలో తనిఖీలు

● వివరాలు సేకరించిన సౌత్ జోన్ డిప్యూటీ డీజీఎంఎస్

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద ఉన్న గ్రానైట్ క్వారీలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ఆరుగురు ఒడిశా కూలీలు మృతి చెందిన విషయం విధితమే. బుధవారం సౌత్ జోన్ (హైదరాబాద్) డిప్యూటీ మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ టీఆర్.కణ్ణన్ ప్రమాదం జరిగిన క్వారీలో తనిఖీలు చేశారు. కూలీలు మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. క్వారీ హద్దులు, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనుల్లో ప్రమాదాలు జరగకుండా భద్రత పరంగా కఠిన నిర్ణయాలు తీసకుంటామన్నారు. క్వారీల్లో పనిచేసే మేనేజర్లు, మేట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రతి రోజు క్వారీల్లో పనుల ప్రదేశాలను పరిశీలించాకే కార్మికులను అనుమతించాలని స్పష్టం చేశారు. క్షతగాత్రుల వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ తనిఖీలో రాష్ట్ర డీఎంస్ అశోక్‌కుమార్, జోన్ డీడీఎంస్ జ్ఞానేశ్వర్, జిల్లా గనుల శాఖ ఏడీ రామచంద్రరావు, సేఫ్టీ టీం సభ్యులు భాస్కరరెడ్డి, సర్వేయర్ నాగలక్ష్మి, క్వారీ యజమానులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అవకతవకలపై సమగ్ర విచారణ

● సమస్యలన్నీ పరిష్కరిస్తాం
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తామని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు వీఎన్ మాధవ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం చీలు రోడ్డులోని ఓ టీ దుకా ణం వద్ద స్థానికులతో ఆయన చాయ్ పే చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్లలోని రామానుజం కూటంపై ఆయన మాట్లాడారు. రామానుజం కూటంను తొలగించి.. లాడ్జి నిర్మాణ ప్రతిపాదనలు వచ్చినప్పుడే అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతిని స్వయంగా కలిసి తాను అభ్యంతరం తెలిపానని ఆయన చెప్పారు. దేవదాయ శాఖ విడుదల చేసిన జీవోల్లో కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా.. స్థానిక ఎమ్మెల్యే డైరెక్షన్ అని రాశారని తెలిపారు. ఇలా రాయడానికి వెల్లేదని మాధవ్ స్పష్టం చేశారు. లాయర్ విన్నకోట సత్యప్రసాద్ రామానుజ కూటంలో జరిగిన అవకతవకలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో..విచారణ చేయి స్తామని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వర్గాల వ్యక్తులతో బీజేపీ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు స్టాప్ కల్పించాలని స్థానికులు కోరారు. నిలిచిన బాపట్ల మెడికల్ కళాశాల అంశాన్ని ప్రస్తావిం చగా త్వరలోనే నూతన విధానంలో పనులు ప్రారంభమ వుతాయని వెల్లడించారు.



చీలురోడ్డు సెంటర్‌లోని ఓ టీ దుకాణం వద్ద జరిగిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో మాధవ్

కార్యకర్తల సమావేశంలో...

పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాలులో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు మాధవ్ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పనిచేయాలని సూచించారు. గ్రామగ్రామాన బీజేపీ జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. దేశసమైక్యత చాటేలా ప్రధాని మోదీ పాలన సాగుతుందన్నారు. బిగ్‌బాస్ విన్నర్ కౌశిక్ మాట్లాడుతూ తాను బాపట్ల అల్లుడినని, ఆ అనుబంధంతోనే ఇక్కడకు వచ్చానని బీజేపీ స్ఫూర్తి దాయక పాలన అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి దయాకర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, జిల్లా ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, జాతీయ ఎస్సీ మోర్చా సెక్రటరీ ఇస్కా సునీల్ తదితరులు పాల్గొన్నారు.



చేనేతల జీవితాల్లో.. వెలుగులు

● నేటి నుంచి ఉచిత విద్యుత్ అమలు ● మగ్గాలకు 200, మర మగ్గాలకు 500 యూనిట్లు ● జిల్లాలో 5,885 మంది కార్మికులకు ఉపశమనం ● నేడు చీరాల్లో జాతీయ చేనేత దినోత్సవం

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. మగ్గాలపై పనిచేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 5,885 మంది చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోనున్నారు. జిల్లాలో మొత్తం సొసైటీల్లో, వ్యక్తిగతంగా సుమారు 23 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారు. సర్వే నిర్వహించి అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. కొన్ని సాంకేతిక, ఇతర కారణాల వల్ల ఎంపిక కాని వారినీ అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తు నేతన్నలకు భరోసా కల్పిస్తోంది. చేనేత దినోత్సవం పురస్కరించుకుని చేనేతలకు ప్రభుత్వం ఒక విధంగా చక్కని భరోసా కల్పించిందనే చెప్పవచ్చు. అంతేకాకుండా నిత్యం మగ్గాలపై పని చేస్తూ.. కళ్లు, కిడ్నీ సమస్యలతో పాటు వివిధ రకాల ఆనారోగ్య సమస్యలను గుర్తించి.. ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కల్పించేందుకు.. ప్రణాళిక చేస్తున్నట్లు అధికారులు అంటు న్నారు. గురువారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, స్థానిక ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం నిర్వహించనున్నారు.

ఆందోళనలో ఉప వృత్తులు

చేనేత ఉప వృత్తుల కార్మికులు ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ సౌకర్యం వీరికి ఆమడ దూరంగా నే ఉంది. దీనిపై అధికారులు సర్వే చేశారే గానీ.. పూర్తిగా భరోసా కల్పించక పోవడంతో వారు సందిగ్ధంలో ఉన్నారు. చేనేత రంగంలో రాట్నం తిప్పేవారు, డయింగ్ యూనిట్లులో పనిచేసే కార్మికులు, పొడుగులు నేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారు జిల్లాలో సుమారు 2 వేల మంది ఉన్నారు.

ఉచిత విద్యుత్‌తో ఆనందం

● ప్రమీల, చేనేత కార్మికురాలు



నాలుగు దశాబ్దాలుగా చేనేత రంగంపై ఆధారపడి కుటుంబాన్ని నా భర్తతో కలిసి పోషిస్తు న్నాను. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసి.. వయోభారంతో ఉన్నాం. కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడం ఆనందంగా ఉంది. వైద్య సాయం కూడా అందించాలి.

పిల్లల చదువులకు ప్రోత్సాహమివ్వాలి

● మల్లికార్జునరావు, చేనేత కార్మికుడు



ఉచిత విద్యుత్ ప్రకటన ఆనందంగా ఉంది. చేనేత రంగంపైనే ఆధారపడ్డాను. కూలీలు గిట్టక.. పూట గడవక అవస్థలు పడుతున్నాం. నాకు ఇద్దరు పిల్లల్లో.. ఒకరిని బీటెక్, మరొకరిని పాలిటెక్నిక్ అప్పులు చేసి చదివించాను. పిల్లల చదువులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి.

టీడీపీలోకి వైసీపీ నేతల భారీ చేరికలు

● కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలో చేరిన మూడు గ్రామాల ముఖ్య వైసీపీ నేతలను, అనుచరులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని చిమ్మిరిబండ సర్పంచ్ జంపని వీరయ్య 30 కుటుంబాలతో, లక్కవరం సర్పంచ్ అట్లూరి జెస్సి బాబు 3 కుటుంబాలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సమక్షంలో పార్టీలో చేరారు. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దాసం అశోక్ కుమార్ తండ్రి, వైసీపీ ముఖ్య నేత హనుమంతరావు తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు, నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేయాలని కొత్తగా చేరిన వారికి సూచించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ గెలిచే పరిస్థితే లేదన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, జాగర్లమూడి శ్రీనివాసరావు, కోటపాటి సురేష్, పెంట్యాల శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ముఖ్యనేత దాసం హనుమంతరావు, అనుచరులు

లోపాలపై లోతుగా తనిఖీ..!

◆ ప్రజావేదికలో బయటపడుతున్న అక్రమాలు
◆ మరో రోజు కూడా నిర్వహించే అవకాశం
◆ పాల్గొన్న డ్వామా పీడీ విజయలక్ష్మి

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలపై బుధవారం బల్లికురవ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక జరిగింది. ఉదయం 10 గంటలకు డ్వామా పీడీ విజయలక్ష్మి పర్యవేక్షణలో ప్రజా వేదిక ప్రారంభం కాగా.. రాత్రి 8 గంటలకు మూడు గ్రామాల్లో జరిగిన పనులపైనే తనిఖీల వివరాల వెల్లడి కొనసాగింది. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అవకతవకలు బయట పడుతుండటంతో.. ప్రజా వేదిక సభ ముందుకు పోవడం చాలా కష్టంగా మారింది.

● కొప్పెరపాలెంలో హార్టి కల్చర్‌లో మొక్కలు వేయకుండానే నిధులు డ్రా చేశారని, అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వెలుగు వీఏఓలకు మస్టర్లు వేశారని గుర్తించారు. చెక్ డ్యాంలో పనులు చేయకుండానే.. రూ.6 లక్షల నిధులు డ్రా చేశారని గుర్తించారు. ఈ గ్రామంలో రూ. 9 లక్షల పైబడి అకమాలు జరిగిన్నట్లు గుర్తించారు.

● కొమ్మినేనివారిపాలెంలో మస్టర్లు లేకుండా కూలీలకు నగదు చెల్లించారని, పనులలో కొలతలు తేడా ఉన్నట్లు గుర్తించారు.

● ముక్తేశ్వరంలో 28 కాల్వల పనులు చేయగా.. 20 పనుల్లో కొలతలు తేడాలు ఉన్నాయని రూ.లక్షల మేర అక్రమాలు జరిగాయని ఆడిట్ బృందం తేల్చింది. అలానే అమృత్ సరోవర్ కుంటలో కొలతలు చాలా వరకు తేడాలు ఉన్నాయని.. నగదు డ్రా చేశారని తెలిపారు.

ప్రజా వేదిక సభ గురువారం కూడా జరుగుతుందని అధికారులు తెలిపారు. స్టేట్ విజిలెన్స్ ఆఫీసర్ భవాని హర్ష, ఎస్‌ఆర్‌పీ తులసినాయక్, ఆడిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఏపీడీ కోటయ్య నాయక్, క్వాలిటీ అధికారి సతీష్, ప్రోగ్రాం మేనేజర్ సునీల్‌కుమార్, ఎంపీడీవో కుసుమకుమారి, ఏవో పాండురంగస్వామి, డీపీఎం సనిత పాల్గొన్నారు.



బల్లికురవలో అవకతవకలపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ విజయలక్ష్మి

8, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు 6

భరోసా కోసం వెళ్తే.. బండారం బయటపడింది
● అక్క ఆస్తిని కాజేసిన తమ్ముడు,మేనల్లుడు

పూర్తయితే.. రాచ మార్గాలే..
రూ. 930 కోట్లు మంజూరు చేసిన కేంద్ర జాతీయ రహదారుల శాఖ
8 ఇప్పటికే వర్చువల్ విధానంలో పునాదిరాయి వేసిన మంత్రి గడ్కరీ

కదిలిన యంత్రాంగం

బలిజేపల్లి, నంబరు వన్ కాల్వలకు నీటి విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




బూతుమల్లి రెగ్యులేటరీ నుంచి సాగునీటిని కిందికి వదిలిన చిత్రం

వేమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'నెర్రెలిచ్చిన సాగు నేల' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో.. రేపల్లె ఏడీఏ లక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్ బలిజేపల్లి, నంబరు వన్ కాల్వలను పరిశీలించారు. వాటి పరిధిలోని వెదనాట్ల దుస్థితిని గమనించారు. సాగునీటి విడుదల విషయంపై ఏఈ రవితో చర్చించారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈ బుధవారం ఉదయం 10 గంటలకు కొల్లిపర ప్రధాన కాల్వ నుంచి 250 క్యూసెక్కుల నీటిని రెగ్యులేటరీ నుంచి పూర్తిగా కిందకి వదిలారు. దీంతో రెండు కాల్వల పరిధిలోని అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, కోడిపర్రు, పెనుమర్రు, తాడిగిరిపాడు గ్రామాల పరిధిలోని సాగు భూములకు గురు, శుక్ర వారాల్లో పుష్కలంగా సాగునీరు అందనుంది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సర్దుబాటు ఎప్పుడో..!

● అడ్మిషన్లు లేక ఖాళీగా ఉంటున్న ఉపాధ్యాయులు
● రూ.వేలల్లో జీతాలు.. రియల్టర్లు, బిల్డర్స్‌గా అవతారం
● కదలని సబ్జెక్ట్ టీచర్ల సర్దుబాటు ప్రతిపాదన



ఉమ్మడి గుంటూరులో 60కి పైగా ఎయిడెడ్ పోస్టులు

సబ్జెక్టు టీచర్లు లేక సతమతం అవుతున్న పాఠశాలలు ఒక వైపు.. మరోవైపు ఎయిడెడ్ పాఠశాలల్లో సంతకాలు పెట్టి వెళ్తూ రూ.వేలల్లో ప్రభుత్వ జీతం తీసుకుని ఖాళీగా ఉంటున్న ఉపాధ్యాయులు కొందరు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 మందికి పైగా ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు నెలల తరబడి ఖాళీగా ఉంటూ జీతాలు తీసుకుంటున్నారు. వీరిని సర్దుబాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నా.. అమలు కావడం లేదు. ఫలితంగా ప్రభుత్వం రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తూ.. వారిని బోధనకు దూరం చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

గుంటూరు (విద్య) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, కొల్లూరు, బాపట్ల, రేపల్లె, వీరంగిపురం, అమరావతి, గుంటూరు ఇలా అనేక మండలాల్లో యాజమాన్యాల ఆధ్వర్యంలో

(మిగతా 6లో)

రూ.లక్షల్లో జీతాలు

యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోంది. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు ఇస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు నెలకు రూ.1.20 కోట్ల వరకు ఉపాధ్యాయులకు జీతాలు రూపంలో ప్రభుత్వం భరిస్తోంది. కానీ, బోధన పరంగా వారి నుంచి ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అడ్మిష న్లు లేని పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు ఉద యం, సాయంత్రం వచ్చి హాజరు వేయించుకుని వెళ్త న్నారు. ఇందులో చాలా మంది రియల్టర్లు, బిల్డర్లుగా మారారు. మరికొందరు ప్రయివేటు చిట్స్ నిర్వహణలో మునిగిపోయారన్న ఆరోపణలున్నాయి. వీరిని సబ్జెక్టు టీచర్లు అవసరమైన పాఠశాలలకు బదిలీ చేసి.. బోధన వైపు మళ్లించాలన్న విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

రాజధానిలో.. దళారుల దందా




● కురగల్లుకు చెందిన ఒక అసైన్డ్ రైతు ప్రభుత్వం ఇచ్చిన 500 గజాల రిటర్న బుల్ ప్లాటును ఇటీవల బేరం పెట్టాడు. అక్కడ భూమి విలువ గజం రూ.35 నుంచి రూ.40వేల వరకూ ఉంది. అయితే ఆ ప్లాటుకు అసైన్డ్ వంక పెట్టి గజం రూ. 24 వేలకు కొన్నారు. దీంతో ఆ రైతు గజానికి రూ.10వేల వంతున.. మొత్తం 500 గజాలకు రూ.50 లక్షల వరకూ నష్ట పోయాడు.

● నీరుకొండ గ్రామానికి చెందిన మరొక రైతు తన రిటర్నబుల్ ప్లాటును బేరం పెట్టగా. తొలుత గజం రూ.45వేలకు కొనేందుకు సిద్ధమయ్యారు. అయితే స్టాంపు పేపర్లలో భూమి స్వభావం అసైన్డ్ అని ఉండడంతో గజానికి రూ.8 వేలు తక్కువకు అడిగారు. దీంతో ఆ రైతు భూమి అమ్మేందుకు నిరాకరించాడు.



● కారుచౌకగా స్థలాలు కాజేస్తున్న రియల్టర్లు
● రిటర్నబుల్ ప్లాట్లు.. అసైన్డ్ అంటూ ప్రచారం
● గజానికి రూ.10 నుంచి 20 వేల ధర తగ్గింపు
● సీఎం దృష్టికి తీసుకువెళ్లిన రాజధాని రైతులు
● అయినా ఆగని దళారుల దోపిడీ..



గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అసైన్డ్ రైతుల రిటర్నబుల్ ప్లాట్లపై దళారుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధానిలో భూముల రేట్లు విపరీతంగా పెరిగినప్పటికీ.. అసైన్డ్ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ల ధరలు మాత్రం పాతాళంలోనే ఉన్నాయి. దళారులంతా ఒక్కటై

(మిగతా 6వ పేజీలో)

మొబైల్స్‌తో సమయాన్ని వృథా చేయొద్దు

◆ ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ బీ రాజకుమారి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీ రాజకుమారి

వట్టిచెరుకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియాపై ఆసక్తి చూపుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, దీంతో విద్యపై దృష్టి తగ్గుతుందని ఏపీఎస్‌పీ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు బీ రాజకుమారి ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్స రానికి బీటెక్ విద్యార్థులకు పరిచయ కార్యక్రమం బుధవారం కళాశాల ఆడిటోరియంలో వేడుకగా నిర్వహించుకున్నారు. తొలుత కళాశాల విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి రాజకుమారి ముఖ్యఅతిథిగా హాజరై సాంకేతిక పరిజ్ఞానం మంచిదే. కాని దానికి బానిసలుగా మారకుండా మన అభివృద్ధికి ఎలా ఉపయోగించుకోవాలో నేర్చు కోవాలన్నారు. తాను ఒక సాధారణ కుటుంబంలో పుట్టి క్రమశిక్షణ, నిబద్ధత, లక్ష్య సాధన ద్వారా ఐపీఎస్ అధికారిగా ఎదగటానికి దోహద పడ్డ విషయాలను రాజకుమారి వివరించారు. మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ పెరుమాళ్ళు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు నైపుణ్యాలు, విలువలు, పరిశోధన అభిరుచి ఆచరణాత్మక జ్ఞానం పొందే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జే అప్పారావు, డీన్ అడ్మిషన్స్ పీ రమేష్‌బాబు, డీన్ అకడమిక్ జంపని కిషోర్‌బాబు, వివిధ విభాగాల డీన్‌లు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ మెంబర్లు, మొదటి సంవత్సర విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

గుంటూరు మెడికల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేన్ ప్రోగ్రామ్ పథకంలో జిల్లాలో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాట్స్ ప్లస్ టీబీ హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్, అకౌంటెంట్, టీబీ హెచ్‌వీ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టులకు నిరుడు డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చినట్లు వారు తెలిపారు. తాజాగా విడుదల చేసిన మెరిట్ జాబితాలో పేర్లపై అభ్యంతరాలు ఉన్న వారు ఆగస్టు ఎనిమిది నుంచి 13వ తేదీ లోపు తగిన ధ్రువ పత్రాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాతపూర్వకంగా అందజేయాలని వారు కోరారు. 13వ తేదీ తర్వాత అందే అభ్యర్థనలను స్వీకరించబోమని వారు వెల్లడించారు.

సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు, డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరంకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వీ కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, గాత్రము, వీణ, వయొలిన్, డోలు, మృందగము, కూచిపూడి నృత్యం, నాదస్వరము విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. వయోపరిమితి అవసరం లేదని, గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఎవరైనా ఈ కోర్సులో చేరవచ్చని తెలిపారు. వివరాలకు 0863 223 4913 అనే నెంబర్లో సంప్రదించాలన్నారు.

భరోసా కోసం వెళ్తే.. బండారం బయట పడింది

- ◆ అక్క ఆస్తిని కాజేసిన తమ్ముడు,మేనల్లుడు
- ◆ నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి విక్రయించిన వైనం
- ◆ మేనత్త, పిన్ని ఆస్తులూ పలువురికి విక్రయం
- ◆ రైతు భరోసా సొమ్ముపడకపోవడంతో బయటపడ్డ బాగోతం
- ◆ వివరాలు వెల్లడించిన తెనాలి డీఎస్పీ


నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ ఉమేష్, ఎస్ఐలు

తెనాలి రూరల్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): తోడబుట్టిన తమ్ముడు, మేనళ్లుడు కలిసి అక్క ఆస్తిని కాజేసి అమ్మకం చేసిన ఉదంతాన్ని రూరల్ పోలీసులు బట్ట బయలు చేశారు. బుధవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిందితులను చూపుతూ కేసు వివరాలను డీఎస్పీ జనార్ధన్‌రావు మీడియాకు వివరించారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన కోలపల్లి సత్యనారాయణ, అతడి కుమారుడు కోలపల్లి నరేష్‌లు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. సత్యనారాయణ అక్క గాజుల బసవపూర్ణకుమారి, భర్త, వారి ఇరువురు కుమారులు అదే గ్రామంలో నివాసముంటున్నారు. కాగా పూర్ణకుమారి చిన్నకుమారుడు వివాహం కాకముందే మృతి చనిపోయాడు. పెద్దకుమారుడికి వివాహం జరిగి ఇద్దరు పిల్లలుపుట్టిన తరువాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2024లో భర్తసైతం మృతి చెందడటంతో పెద్దకుమారుడి పిల్లలతో కలిసి పూర్ణకుమారి ఉంటుంది. వీరికి అదే గ్రామంలో 2ఎ కరాల మాగాణిభూమి, 17 సెంట్లు స్థలం ఉంది. ఐతే వరుసకు తమ్ముడైన సత్యనారాయణ, అతడి కుమారుడు నరేష్‌లు అక్క పొలం, స్థలంపై కన్నేశారు. దీనికి ఓ డాక్యుమెంట్ రైటర్ తిరుపతి మరియదాసు, మీ సేవా కేంద్రానికి చెందిన దాసరి శివన్నారాయణలతో కలిసి విషయాన్ని తెలిపారు. దీంతో విజయనగరం జిల్లాలోని బసవపాలెం పంచాయతీ పరిధిలో బసవకుమారి, ఆమె భర్త కుటుంబం నివసిస్తున్నట్లు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించారు. కొన్ని రోజులకు వారి కుటుంబసభ్యుల జాబితాలో వీరి పేర్లు కూడా చేర్చుకున్నారు. అక్క, బావ చనిపోయినట్లు దొంగ మరణ ధృవీకరణ పత్రాలు సృష్టించి ఫ్యామిలీ మెంబర్లుగా సత్యనారాయణ, నరేష్‌లు చేర్చుకున్నారు. తదనంతరం వారి ఆస్తికి సంబంధించిన పొలాన్ని, స్థలాన్ని వీరి పేర్లకు మార్చుకున్నారు. వీటిని దుగ్గిరాల, తెనాలి ప్రాంతానికి చెందిన వారికి విక్రయించారు. కాగా పూర్ణకుమారి ఇటీవల రైతుభరోసా డబ్బులు తన ఖాతాలో జమకావడంలేదని ప్రభుత్వ కార్యాలయాన్ని సంప్రదించింది. దీంతో అసలు విషయం బయటపడింది. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టగా వీరి భాగవతం బట్టబయలైంది. గుంటూరు, తెనాలి మరియు అమర్తలూరు సబ్‌రిజిస్టర్ ఆఫీసులలో హైదరాబాద్, దుగ్గిరాల, మరియు తెనాలికి చెందిన వ్యక్తులకు మొత్తం 5 రిజిస్ట్రేషన్ల ద్వారా అమ్ముకుని సుమారు రూ.55లక్షలు సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. సదరు ఆస్తి విలువ రూ.కోటిపైనే ఉంటాయని వివరించారు. తప్పుడు డెట్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికేట్ తయారు చేసినందుకు ఉపయోగించిన ల్యాప్టాప్ మరియు కలర్ ప్రింటర్‌ని మీసేవా నిర్వాహకుడు శివన్నారాయణకు చెందిన ఆఫీసు నుండి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులు కోల్లపల్లి నరేష్, సత్యనారాయణ, తిరుపతిమరియదాసు, దాసరి శివన్నారాయణలను బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని ఓ కళాశాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరి కొందరి ప్రమేయం ఉందని విచారణ అనంతరం అదుపులోకి తీసుకోనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విచారణలో మరి కొన్ని...

సదరు నిందితులపై మంగళగిరి, అమర్తలూరు పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు చొప్పున విచారణ జరుగుతోంది. 2020వ సంవత్సరంలో నరేష్ డాక్యుమెంట్ రైటర్‌తో కలిసి తన తల్లి కోలపల్లి రమాదేవి పేరు మీద ఉన్న ఓటు కార్డులో తన పేరుకు బదులుగా తన పిన్నిపేరు గుర్జేటి కళేశ్వరిగా మార్చి, ఫేక్ ఓట్ కార్డుతో నరేష్, డాక్యుమెంట్ రైటర్ కలిసి తన పిన్నికి చెందిన మూడున్నర ఎకరాల పొలాన్ని తెనాలి పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి అమ్మేశారు. దీనిపై అమర్తలూరు పోలీస్ స్టేషన్లో వీరిద్దరి పైన కేసు నమోదైంది. ఆ తరువాత నరేష్ తనకి తెలిసిన వారితో కలిసి గుంటూరు జిల్లా పొత్తూరులోని 30 సెంట్లు పొలముకు సంబంధించిన పత్రాలలో యజమాని పేరు మార్చి మంగళగిరి పట్టణానికి చెందిన రామినేని సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద ఆ పొలం దొంగ పత్రాలను తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నందుకు గానూ నరేష్ మీద మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ప్రస్తుతం ఇవి కూడా దర్యాప్తులో ఉన్నాయి.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి

ఎంబీటీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లూరి శేఖర్

గుంటూరు(విద్య), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అద్భుతాల సృష్టికర్తలు ఇంజనీరింగ్ విద్యార్థులే అని, సాంకేతిక యుగంలో నెలకొన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ టీం వర్క్ పెంపొందించుకోవాలని నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఏ.ఐ.సీ.టీ.ఈ ఇండక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాళ్లూరి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన దిశగా, ప్రారంభంలోనే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని, నిత్యం సాంకేతిక రంగం వేగం పుంజుకుంటున్నదని, సమయాన్ని వృథా చేయకుండా విద్యపైనే శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ కే రవీంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రామసుబ్బారావు (ఫైల్‌ఫొటో)

పిచికలపాలెం(శావల్యాపురం)ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పొలానికి నీళ్ళు పెట్టేందుకు వెళ్ళి రైతు మృతి చెందాడు. ఎస్సై లోకేశ్వరరావు కథనం ప్రకారం శావల్యాపురం మండలం పిచికలపాలేనికి చెందిన రైతు తిరువీధి రామసుబ్బారావు (64) పొలంలో నీటి అవసరాల కోసం విద్యుత్ మోటర్ బిగించుకొని కొంకేరువాగులో నీటితో పంటలు సాగు చేసుకొంటున్నాడు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కావడంతో ఇటీవల పొలంలో వరినారు పోశాడు. నారుమడికి నీళ్ళు పెట్టేందుకు తన కుమారుడు రంగారావుతో కలసి బుధవారం ఉదయాన్నే పొలానికి వెళ్లాడు. రామసుబ్బారావు మోటర్ స్విచ్ వేసినా ఆన్ కాకపోవడంతో, విద్యుత్‌తీగలు కదిలిస్తుండగా షాకుకు గురై పడిపోయాడు. కుమారుని సమాచారంతో గ్రామస్తులు పొలం వద్దకు చేరుకొని రామసుబ్బారావును వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామసుబ్బారావు మృతి చెందినట్లుగా డాక్టర్‌లు నిర్ధారించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ లోకేశ్వరరావు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకొన్నారు. రామసుబ్బారావు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్ట్ మర్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు రామసుబ్బారావు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

దాచేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ ప్రయత్నం చేస్తూ ఉద్యోగం రాలేదన్న నిరాశ, నిస్పృహకు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం దాచేపల్లి మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన కామిరెడ్డి బ్రహ్మారెడ్డి(27) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానివేసిన హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌పీ కాలనీలో పీజీ హాస్టల్‌లో ఉంటున్న బ్రహ్మారెడ్డి ఉద్యోగం రావటం లేదని గత కొంత కాలంగా మనస్థాపానికి గురయ్యాడు. ఈ విషయం పలుమార్లు తల్లిదండ్రులకు కూడా చెప్పినట్టు సమాచారం. అయితే తాను చనిపోతున్నానని బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేపీహెపీ కాలనీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృత దేహాన్ని జేమ్స్ హాస్పటల్‌కు రైల్వే పోలీసులు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి తండ్రి కామేపల్లి శ్రీనివాసరెడ్డికి ఇద్దరు కుమారులు, పెద్ద బ్బాయి సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తూ భార్య, బిడ్డలతో జీవనం సాగిస్తున్నాడు. మృతుడు బ్రహ్మారెడ్డి చిన కుమారుడు. ఉద్యోగ ప్రయత్నంలోనే మనస్థాపానికి గురై కుమారుడు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటన పెదగార్లపాడు గ్రామంలో తోటి స్నేహితులకు, బంధువులకు తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రమోషన్‌లలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు జడ్పీ ఉద్యోగుల ఫిర్యాదు

15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని సీఈఓకు ఆదేశాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పదోన్నతుల వ్యవహారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చేరింది. ఖాళీలు ఉన్నా భర్తీ చేయకుండా ఫైళ్లకు కొర్రీలు వేస్తూ ఎస్సీ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు తదితరులు ఈ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో 79 అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పోస్టులు ఉండగా ఎస్సీలకు 15 శాతం కేటాయించాల్సి ఉందని.. ఆ లెక్కన 12 మంది ఏఓలు ఉండాల్సి ఉండగా, కేవలం 9 మంది మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన 3 ఖాళీలకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ జిల్లా పరిషత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు స మాచారం. ఈ అంశాన్ని జడ్పీ సీఈఓ 15 రోజుల్లో పరిష్క రించాలని, తదుపరి వివరాలు తెలియజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

8, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8, 10 తేదీల్లో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ స్పెషల్ ఈ నెల 8వ తేదీన రాత్రి 7.30కి బయలుదేరి 10.58కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.05కి గుంటూరు, 9వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి స్పెషల్ ఈ నెల 10వ తేదీ(ఆదివారం) రాత్రి 8.10కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.40కి గుంటూరు, 2.23కి సత్తెనపల్లి, 11వ తేదీ ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

ఫిరంగిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. ఫిరంగిపురం పోలీసుల వివరాల ప్రకారం వేములూరిపాడు గ్రామానికి చెందిన పచ్చల అబ్రహం(76) సైకిల్‌పై పేరేచర్ల వైపు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో సైకిల్‌పై నుంచి వృద్ధుడు రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య విజయమ్మ గత నెలలోనే మృతి చెందగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తర లించామని పోలీసులు తెలిపారు.

మంగళగిరిలో సీఎం పర్యటన సాగేదిలా...

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు గురువారం మంగళగిరిలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన మంగళగిరి ఆటోనగర్‌లోని హ్యాండ్‌లూమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్(వీవర్ శాల)కు చేరుకొంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అక్కడే చేనేత కార్మికులతో ముఖాముఖీగా సమావేశం అవుతారు. ప్రజావేదిక వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు తన పర్యటన ముగించుకొని ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరతారు.

వేపకంపల్లి ఎంపీటీసీగా కనకదుర్గ శ్రీనివాసరావు


డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న కనకదుర్గ శ్రీనివాసరావు

కారంపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకపల్లి గ్రామ ఎంపీటీసీగా బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీటీసీగా వ్యవహరించిన కోక అక్కమ్మ మరణించడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో వేపకంపల్లి గ్రామానికి చెందదంఇన బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు శుక్రవారం టీడీపీ తరుపున నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఎన్నికల అధికారి సిద్ధ లింగమూర్తి చేతుల మీదుగా వేపకంపల్లి ఎంపీటీసీగా కనకదుర్గ శ్రీనివాసరావు డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము, మునుగోటి సత్యం, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి కోటేశ్వరరావు, కందిమళ్ల లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చిలకలూరిపేట, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట గడియార స్తంభం సెంటర్లో ఒక యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పట్టణంలోని టీవీ రిపేర్ సెంటర్‌లో పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అమీర్ (28) మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. అయితే బుధవారం షాప్‌లో టీవీ రిపేర్ చేస్తూ షాక్‌కు గురై మృతి చెందాడు.

సర్దుబాటు ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు నడుస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు సక్రమంగా లేకపోవడంతో ఒక్కో పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు. ఆయా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మండలాల వారీగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల సంఖ్యను తెలియజేయాలని కోరుతూ ఎంఈఓలకు, డిప్యూటీ ఈఓలకు విద్యాశాఖ నుంచి లేఖలు వెళ్లాయి. దీంతో వెంటనే మండల స్థాయిలో ఉన్న పాఠశాలలను పరిశీలించి ఎంఈఓలు ఖాళీల వివరాలను సేకరించారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో 60 పైగా ఖాళీలు ఉన్నట్లు తేలింది. ఇక్కడ పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులని సమీపంలోని ఉన్నత పాఠశాలలు లేదా ప్రాథమిక పాఠశాలలో సర్దుబాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఈలోగా బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టారు. బదిలీల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా.. సర్దుబాటు ప్రక్రియపై విద్యాశాఖ దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

49,084 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,597 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,084 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,027 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	10500	12800	నెంబరు. 5	10000	13300
341	10000	14000	273	----	----
4884	----	----	341	11000	14800
సూపర్ 10	10000	13400	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12200
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10200	12300
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	5000	7000

దళారుల దందా!

(5వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూములన్న వంకతో వారి భూములను కారు చౌకగా కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దళారుల దందాలో ఎంతోమంది సామాన్య రైతులు రూ.లక్షలకు లక్షలు నష్టపోతున్నారు.

● అసైన్డ్ రైతుల ప్లాట్లే టార్గెట్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసమీకరణ చేశారు. 29వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు.. 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వారి భూములపై సీఐడీ కేసులు వేసిన గత ప్రభుత్వం.. వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ భూములకు సర్వహక్కులు కల్పించింది. రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు కూడా 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని చెబుతూ గజంపై రూ.10వేలు నుంచి రూ.20 వేల తగ్గిస్తున్నారు.

● సీఎం దృష్టికి వ్యవహారం

దళారుల దోపిడీని రాజధాని రైతులు ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికే తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం ప్రభుత్వం రిజిస్టర్ చేసి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అసైన్డ్ ఎలా అవుతాయి అంటూ సీఆర్డీఏ అధికారులను ప్రశ్నిం చారు. దానిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్ప టికీ దళారుల దందా తగ్గలేదు. ఇప్పటికీ అదే దోపిడీ కొనసాగుతోంది.

● సీఆర్డీఏ స్పందించకుంటే నష్టమే

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన దస్తావేజుల్లో ఉన్న ఒక చిన్న సాంకేతిక అంశాన్ని ఆసరా చేసుకుని దళారులు దోపిడీ చేయడంపై ప్రభుత్వం, సీఆర్డీఏ తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. భూమి స్వభావం అనే కాలమ్‌లో 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే సీఆర్డీఏ అధికారులు, సంబంధిత మంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన, దళారులకు హెచ్చరిక చేయాలని కోరుతున్నారు.

బాపట్ల వార్తలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ


మాధవ్‌ను సత్కరించి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మాధవ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలను తెలిపారు.

రామానుజకూటం తొలగింపుపై మాధవ్‌కు ఫిర్యాదు

బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం, రథంబజారులో ఉన్న శ్రీమాకర్లవారి రామానుజకూటమును గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా తొలిగించారు. ఆ ప్రదేశంలో దాతల ఆశయాలకు విరుద్ధంగా దాతల వంశీయులను సంప్రదించకుండా ఆర్కియాలజి వారి అనుమతులు కూడా లేకుండా ఒక లాడ్జి నిర్మాణం చేశారు. ఈవిధంగా ఒక దాతల ఆశయాలకు విరుద్ధంగా లాడ్జిని నిర్మించటం చట్టవిరుద్ధమని బాపట్లకు చెందిన అడ్వకేట్ విన్నకోట సత్యప్రసాద్ బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సదరు రామానుకూటమిని ఏకపక్షంగా దేవదాయశాఖలో విలీనం చేయటం గతంలో ఉన్న కోర్టు జడ్జిమెంట్‌కు కూడా విరుద్ధమని, ఈ విషయమై జిల్లా దేవదాయ శాఖాధికారులను సమాచారహక్కుచట్టం కింద వివరణ అడిగినా కాలయాపన చేస్తున్నారన్నారు. అంతేకాకుండా గతంలో 2021-2022 సంవత్సరంలో శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పేరుతో ఇబ్బడిముబ్బడిగా కోట్లలో భక్తుల వద్ద నుంచి విరాళాల రూపంలో డబ్బు, బంగారం, వెండి వసూలు చేసి ఇంతవరకు వాటి గురించి భక్తులకు లెక్కలు చెప్పకుండా జీర్ణోద్ధరణ కమిటి, పెద్దలు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సదరు విరాళాలు దుర్వినియోగం జరిగి ఉండవచ్చునని శ్రీభావన్నారాయణస్వామి భక్తులు, దాతలు బాపట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఈ విషయంపై తగు విధంగా స్పందించి బాధ్యులు ఏ ప్రభుత్వంవారైన అధికారులు, రాజకీయనాయకులైనా వారిపై ప్రభుత్వ విచారణకు ఆదేశించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈస్ట్ బాపట్లలో బీసీ సంక్షేమ శాఖ డీడీ శివలీల పర్యటన


ఈస్ట్ బాపట్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న శివలీల

బాపట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల పంచాయతీ నందిరాజుతోట గ్రామంలో బుధవారం బాపట్ల మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివలీల పర్యటించారు. ప్రజల ఆరోగ్యాన్ని గురించి ముఖ్యంగా డెంగీ తదితర విషజ్వరాలు గురించి, పారిశుధ్యం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ, వైద్య, ఆరోగ్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని కొన్ని గృహాలను సందర్శించి ఇంటి ముందు మురికిగుంతలు కాకుండా ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం, తూర్పు, పడమర పిన్నిబోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల, బేతపూడి, వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం గ్రామాలను కూడా ఆమె సందర్శించి డెంగీ తదితర విషజ్వరాలు గురించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ, ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో హద్దుల సమస్యను పరిష్కరించిన తహసీల్దార్

బాపట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో గతంలో ప్రభుత్వ భూమిని 9 మంది రైతులకు సాగు చేసుకునేందుకు పట్టాలు మంజూరు చేసింది. అప్పటి నుంచి రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల హద్దుల వద్ద రైతులకు సమస్య రావటంతో కొందరు రైతులు హద్దులు చూపించి సమస్యను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలతో బాపట్ల తహసీల్దార్ సలీమా, సర్వేయర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పూండ్ల గ్రామంలోని రైతులకు ఇచ్చిన భూములను పరిశీలించి హద్దుల సమస్యను పరిష్కరించారు. రైతులకు చెందిన పొలాల హద్దురాళ్ల వేయించారు. తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ మండల, పట్టణ ప్రజలకు సమస్యలు ఏమైన ఉంటే సంబంధితశాఖాధికారులకు తెలియజేయాలని, తద్వారా సమస్యలకు సత్వరమే పరిష్కారం లభ్యమౌతుందన్నారు.


పూండ్ల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న బాపట్ల తహసీల్దార్ సలీమా

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను బుధవారం రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రవ్యాప్తంగా మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులు సరిపడ ఉద్యోగస్తులతో నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, మొదలగు వాటిలో ఉద్యోగాల కోసం వెలువడుతున్న నోటిఫికేషన్‌లలో మాజీ సైనికులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న తాండ్ర సాంబశివరావు తదితరులు

ఈస్ట్ బాపట్ల పీఏసీఎస్ ఛైర్మన్, కార్యవర్గ సభ్యులకు అవార్డు

బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్ బాపట్ల పీఏసీఎస్ ఛైర్మన్ తాతా హరిశ్చంద్రప్రసాద్, సంఘ కార్యనిర్వాహక అధికారి చంద్రమౌళి బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చేతులమీదగా అవార్డులను అందుకున్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ వారు రాష్ట్రంలో ఉన్న 2075 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుంచి 2023-2024, 2024-2025 ఆర్థిక సంవత్సరాలకు సంఘాలలో రైతులకు సకాలంలో రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి సహాయ సహకారాలను అందించినందుకుగాను ఈస్ట్ బాపట్ల పీఏసీఎస్ లిమిటెడ్ సంఘానికి 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ప్రతిభా పురస్కారం లభించింది.

మద్యం తాగి వాహనాలు నడపరాదు : ఎస్‌ఐ

బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా పట్టుబడితే జరిమాన విధించటం జరుగుతుందని పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం బాపట్ల పట్టణ రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులకు నిధులు

● సర్వశిక్ష అభియాన్ ఏఈ పవన్‌కుమార్


చావలి పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్వశిక్ష అభియాన్ ఏఈ పవన్‌కుమార్

వేమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వివిధ పాఠశాలల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తంగా యాన్యువల్ వర్క్ ప్లాన్ బడ్జెట్ ద్వారా రెండు కోట్ల రూపాయలు కేటాయింపు జరిగిందని సర్వ శిక్ష అభియాన్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం చావలి ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించిన ప్రహరీ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, కొల్లూరు మండలంలో కొల్లూరు రెగ్యులర్ సుగ్గునలంక, అనంతవరం ప్రాథమిక పాఠశాలలు, వేమూరు మండలంలోని చావలి రెగ్యులర్, కాకర్లమూడి బూతుమల్లి, కుచ్చెళ్లపాడు పాఠశాలలు, అమృతలూరు మండలంలో పాంచాళవరం, ఇంటూరు, యలవర్రు గ్రామాల్లోని నాలుగు పాఠశాలలు, భట్టిప్రోలు మండలంలో వెల్లటూరు, ఓలేరు, జీవీపాలెం, ఏకేవీ పాలెం, సూరేపల్లి, వేమవరం, పల్లెకోన గ్రామాల్లోని ఏడు పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం నిమిత్తంగా ఒక్కొక్క పాఠశాలకు రూ.9.32 లక్షల చొప్పున ఒక కోటి 67 లక్షల 76 వేల నిధులు కేటాయింపు జరిగిందన్నారు. తాగునీటి సౌకర్యాలు నిమిత్తంగా వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, అమృతలూరు రామన్న చెరువు సమీపంలోని ప్రాథమిక పాఠశాల, చినపరిమి 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాలకు ఒక్కొక్క దానికి రూ.3.40 లక్షల చొప్పున రూ.10.20 లక్షలు కేటాయించారన్నారు. దివ్యాంగ విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తంగా కొల్లూరు గౌడపాలెం ప్రాథమిక పాఠశాల, అమృతలూరు రామన్న చెరువు సమీపంలోని ప్రాథమిక పాఠశాల, భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి ప్రాథమిక పాఠశాలలకు ఒక్కొక్క దానికి రూ.4.65 లక్షలు చొప్పున రూ.13.95 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ర్యాంపుల నిర్మాణం నిమిత్తంగా చుండూరు మండలం మున్నంగివారిపాలెం పాఠశాల, అమృతలూరు రామన్న చెరువు సమీపంలోని ప్రాథమిక పాఠశాలకు ఒక్కొక్క దానికి రూ.1.25 లక్షలు చొప్పున రూ.2.50 లక్షలు కేటాయించారన్నారు. సంబంధించిన నిధులను పాఠశాలల ఖాతాలకు జమ చేయడం వల్ల నిర్మాణాల పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులను చేపడుతున్నట్లు వివరించారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

పిట్టలవానిపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులచే శక్తి టెస్ట్‌కాల్స్ చేసి చూపించటం ద్వారా ప్రత్యక్షంగా విద్యార్థులకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. శక్తి వాట్సప్ యాప్ కంప్లైయింట్స్ ప్రాధాన్యత గురించి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సెల్ఫ్ డిఫెన్స్ సోషల్ మీడియా ద్వారా ఫొటోస్ మార్ఫింగ్, ఫేక్ వీడియోను ఎలా ఎదుర్కోవాలి, యాంటీ డ్రగ్స్ సైబర్ నేరాలపై విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో చందోలు ట్రైనీ ఎస్‌ఐ రాజ్యలక్ష్మి, చందోలు పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటశివకుమార్ తదితరులు

నేడు శ్రీలక్ష్మి మోర్తాలమ్మ కొలుపులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తగౌడపాలెం (రెడ్డిపాలెం) గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మి మోర్తాలమ్మ అమ్మవారి కొలుపులు గ్రామస్థుల సహాయ సహకారాలతో అత్యంత వైభవోపేతంగా ఈనెల 7వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమౌతాయని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు, నైవేద్యాల సమర్పణ, అనంతరం మొక్కుబడులు చెల్లింపుల కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

కర్లపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మనవారిపాలెంలో ఉన్న సంపద సృష్టి శిక్షణ కేంద్రంలో పంచాయతీలలోని ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా రీసోర్స్‌పర్సన్ శ్రీనివాస్ పాల్గొని అవగాహన కల్పించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

జిల్లా హాకీ టీమ్ ఎంపిక

బాపట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదిన జరగబోవు జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్ల జిల్లా హాకీ టీమ్ బాలబాలికల సెలక్షన్స్ చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో బుధవారం బాపట్ల స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరులో జరిగే జోన్-3 పోటీలలో పాల్గొనటం జరుగుతుందని డీఎస్‌డీఓ పాల్‌కుమార్ తెలిపారు. బాలుర జట్టుకు ఎంపికైన వారు వై.శరత్‌బాబు, జె.ప్రవీణ్, ఎం.శరత్‌చంద్ర, కె.సాగర్, ఎస్‌కే షబ్బీర్, జె.పీటర్‌పాల్, ఎస్‌కే సాయిల్, కె.లోకేష్, కె.దుర్గా, ఎన్.సిసింద్రి, నరేష్, మహేష్, మణికంత, బాలికల జట్టులో ఎన్.ఉమాదేవి, కె.గాయత్రి, బి.అనురాధ, వి.రేణుక, టి.శాంతి, సీహెచ్.మానస, టి.జ్యోతిర్మయి, వరలక్ష్మి, ఎ.శ్రీనేహ, పి.ప్రత్యూష, జి.దివ్య, జి.గౌతమి, జి.వర్షిత, బి.దివ్య, బి.రూన్సీ ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ కృష్ణారావు, సీనియర్ ఉపాధ్యాయులు విక్టోరియమ్మ, బాపట్ల హాకీ కోచ్ వెంకట్, పీడీ వీరచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జిల్లా హాకీ టీమ్‌కు ఎంపికైన విద్యార్థులతో చెరువుజమ్ములపాలెం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

అన్నదాత సుఖీభవ పథకానికి ఆధార్ లింక్ తప్పనిసరి

కర్లపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే పొలానికి ఆధార్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏట్రవారిపాలెం, కర్లపాలెం గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ లింక్ అవ్వని రైతులు ఈనెలాఖరు లోపల పొలానికి ఆధార్ లింక్ చేయించుకోవాలన్నారు. విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు వినయ్, భవానీ, రైతులు పాల్గొన్నారు.

పసుపు పంటలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

● రిటైర్డ్ ఏడీఏ శ్యాంసుందర్‌రెడ్డి

కొల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పసుపు పంటలో తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ దిగుబడులు పొందవచ్చని రిటైర్డ్ ఏడీఏ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో నీలగిరి ఫౌండేషన్, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, నేడు రైతులు పసుపు పంటపై విపరీతంగా రసాయనిక ఎరువులు పిచికారీ చేసి పెట్టుబడులు పెరిగిపోయి రైతుకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ, పురుగు మందులు అవశేషాలు లేని పంటను పండించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం బాట పట్టాలన్నారు.

కార్యక్రమంలో నీలగిరి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఎ.రత్తయ్య, పి.వెంకటేశ్వర్లు, రైతు సుంకర శ్రీను, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు. చింతల్లంకలో గురువారం పసుపు పంటపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ తెలిపారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఆదర్శవేదిక నాయకులు

రాణిసత్రం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

రేపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పేరొందిన రాణిసత్రానికి అధిక రేట్లు పెట్టటంతో సామాన్యులకు భారంగా మారిందని, మున్సిపల్ అధికారులు దృష్టిసారించి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా రేట్లను తగ్గించాలని ఆదర్శ వేదిక కార్యదర్శి వైకిషోర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ కె.సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో ప్రభుత్వం తరుపున ఒక్క సత్రమే ఉందని, కర్మకాండలు చేసుకోవాలన్నా, నివాసం ఉండాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారుల దృష్టిసారించి నామమాత్రపు రేట్లను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహనరావు, కె.వెంకటేశ్వర్లు, జీ.సాంబశివరావు, ఆనందరావు పాల్గొన్నారు.

రేపు మహాలక్ష్మి అమ్మవారి మానుపూత మహోత్సవం

వేమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి స్వరూపంగా భావించే వేపమానుకు శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని వార్షిక ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది 153వ మాను ఉత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం జరుపునున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి తదితర భజన మండలిలతో సంయుక్తంగా కోలాట భజనలు సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా


జంపనిలో గర్భిణులకు పోషకాహార పదార్థాలు అందజేస్తున్న సూపర్‌వైజర్ అమృతవాణి

వేమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా ఉపయోగపడతాయని, పుట్టిన గంటలోనే తల్లి పాలు తాగించాలని అంగన్‌వాడీ ఏరియా సూపర్‌వైజర్ అమృతవాణి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని జంపని గ్రామంలో గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ, తల్లిపాల సంస్కృతిని కొనసాగించేందుకు ప్రాధాన్యతను కల్పించాలన్నారు. గర్భిణులకు పోషకాహార పదార్థాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మేరికుమారి, బసవమ్మ, జయప్రద, లక్ష్మీ తిరుపతమ్మ, విజయదుర్గ, సువర్ణ, కోటిలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనగాల పీహెచ్‌సీలో...

చెరుకుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం కనగాల పీహెచ్‌సీలో మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనగాల పీహెచ్‌సీ డాక్టర్ భావన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిముర్రుపాలు ఇవ్వడం వలన ఆరునెలలుకు సరిపడా వ్యాధి నిరోధక శక్తి బిడ్డకు అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనగాల సర్పంచ్ షేక్ అఖిల్, పల్లపట్ల ఇన్‌చార్జి సీడీపీవో స్వరూప, గూడవల్లి, చెరుకుపల్లి, కావూరు సెక్టార్ సూపర్‌వైజర్లు ఎం.గౌరీ, ధనలక్ష్మి, సుబ్బమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కనగాల పంచాయతీ పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.

నేడు తల్లిపాల వారోత్సవాల ముగింపు

కొల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల ముగింపు వారోత్సవాలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని బుధవారం తెలిపారు. కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కొల్లూరు, అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ముగింపు వారోత్సవాలలో కేంద్రాల పరిధిలోని తల్లి బిడ్డలతో పాల్గొనాలన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదు

నిజాంపట్నం (రేపల్లె), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా విద్యలో రాణించాలని నిజాంపట్నం ఎస్‌ఐ కందుల తిరుపతిరావు అన్నారు. నిజాంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అనే విషపు ఊపిరిని తీసుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత స్థితికి ఎదిగే విధంగా విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. మత్తుకు బానిసకాకుండా, సెల్‌ఫోన్‌ల బారినపడకుండా ఉండాలన్నారు. విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అవరోధించి తోటివారికి సహాయపడేవిధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగభూషణరావుకు భారతసేవ రత్న అవార్డు


నాగభూషణరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కళాశాల విశ్రాంత ఉద్యోగి నంబూరి నాగభూషణరావు ఈనెల 14వ తేదీన అవార్డు అందుకోనున్నారు. మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన ఆయన వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన మనం ఫౌండేషన్ సంస్థ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా నాగభూషణరావుకు భారత సేవరత్న నేషనల్ అవార్డు, డాక్టరేట్‌ను అందించనున్నారు. గత 3 దశాబ్దాలుగా విద్యాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా గ్రామస్థాయి నుంచి మహాసభల వరకు సేవలు అందించారు. పలు అవార్డులు అందుకోనున్న ఆయనను గ్రామ పెద్దలు, మిత్రబృందం అభినందించారు.

ప్రజలకు డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

చెరుకుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : డెంగీ, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బుధవారం మండల పరిషత్ అధికారి, మెడికల్ ఆఫీసర్లు వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు ప్రతి ఇంటికి వెళ్ళి డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరం లక్షణాలుంటే పరీక్షలు నిర్వహించి వెంటనే వైద్యసహాయం అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సైడ్‌కాలువలలో పేరుకుపోయిన మురుగు తీయించినీరు సక్రమంగా పారేలా చేసి సున్నం, బ్లీచింగ్ చల్లించాలన్నారు. దోమల నివారణకు ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు.

రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. మండల పరిధిలోని పెసర్లంక గ్రామానికి చెందిన ఉప్పు రామయ్య సతీమణి వెంకటసుబ్బమ్మ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గాజుల్లంక పీఏసీఎస్ అధ్యక్షుడు గళ్లా వెంకటతిరుపతయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. ఆ కార్యాలయం నుంచి అందిన రూ.3 లక్షల చెక్కును బుధవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

అమృతలూరు మండల పరిధిలో...

అమృతలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురికి బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. కూచిపూడి గ్రామానికి చెందిన గడ్డిపాటి నాగరాజకుమారికి రూ.లక్షా 62 వేలు, పెదపూడికి చెందిన షేక్ ఫాతిమాబికి రూ.లక్షా 37 వేల 243, అమృతలూరుకు చెందిన వెలువోలు మధనమోహనరావుకు రూ.81,662, గోవాడకు చెందిన కుర్రా కోటేశ్వరరావుకు రూ.లక్షా 28 వేల 750, ఇంటూరుకు చెందిన తిరళ్శక రంగనాయకమ్మకు రూ.64,258 చెక్కులను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆయా బాధితులకు గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

ఈదుపల్లిని సందర్శించిన ఇన్‌చార్జి జేసీ


వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్

నగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ప్రబలుతున్న విషజ్వరాల నేపథ్యంలో స్థానిక సమస్యలపై అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ బుధవారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. అలాగే గ్రామంలో మురుగుకాల్వల నిర్మాణానికి అవసరమైన నివేదిక ఉన్నతాధికారులకు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాంచారయ్య, డీపీవో ప్రభాకర్, ఎంపీడీవో బిశ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలకు సంజీవని సేవలు

చెరుకుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలలో గాయాలపాలైన వారికి, అత్యవసర సేవల సమయంలో ఎందరికో వైద్యసేవలు అందించి ప్రాణాలు నిలబెట్టిన ఘనత సంజీవని వైద్యశాలదని ఎముకలు, కీళ్ళ వైద్య నిపుణుడు డాక్టర్ హరీష్ అన్నారు. గుళ్ళపల్లిలోని వైద్యశాలలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటితో తమ వైద్యశాల ఆవిర్భవించి 7వ సంవత్సరంలో అడుగు పెట్టిందన్నారు. 24 గంటల అత్యవసర వైద్యసేవలను నామమాత్రపు ఫీజులతో గ్రామీణ ప్రజలకు అందిస్తున్నామన్నారు.

IN THE HIGH COURT OF JUDICATURE OF ANDHRA PRADESH AT AMARAVATHI
A.S.No.1847 of 1995

Between :
Kothamasu Veera Raghavaiah (Died) & Others ... Appellants
And
Shaik Khajabi (Died) & Others ...Respondents
To,

27. Shaik Aphrishak W/o.Shaik Molali, R/o.Cherukupalli, Prakasam District
41. Earla Mala Kondaiah S/o.Late Narasimhaiah, Aged about 52 years, R/o.D.No. 9-4-25, Kamaraju Street, Near Indhiragandhi Statue, Kamaraju Street, VTC: Bapatla, Po.Bapatla, Bapatla District.
42. Erla Srinivasa Rao S/o.Narasimhaiah, Aged about 41 years, R/o.D.No.464, NTR center, Chilakaluripet, Guntur District. ...Respondent/Proposed Respondent No.37
43. Khaleel ahmed S/o.Shaik Mastan, Aged about 55 years, R/o.D.No.40-3-9A, Kalyanam Ramarao Street, Revenue Colony Park, Revenue Colony, Labbipet, Vijayawada, A.P.- 520010. ...Respondent/Proposed Respondent No.3
44. Nadipineni Seshamma W/o.Anjaneyulu, D/o.Narra Hanumatha Rao, Aged about 35 years, R/o.Penaka vari veedhi, Pamidipadu, Korisapadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.4
48. Kamma Kanthamma W/o.Late Kamma Mallikharjuna Rao, Aged About 60 years, R/o.at Garipati Towers, Ongole Road, Addanki Village, Bapatla District.
49. Kamma Siva Parvathi D/o.K.Mallikarjuna Rao, Aged about 40 years, R/o.Beside Municipality, Shivani Graphics, Addanki Village and Mandal, Bapatla District.
50. Subhashini W/o.Srinivasa Rao, D/o.K.Mallikarjuna Rao, Aged about 38 years, R/o.Ambadipudi Village, Ballikurava Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.8
51. Jujjuri Padma W/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 40 years, R/o.opp.Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet Palnadu District.
52. Geetha Leelavathi D/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 26 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District.
53. Jujjuri Prudhvi Kumar S/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 24 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District. ...Respondent/Proposed Respondent No.14
54. Shaik Subhani S/o.Late Shaik Khasim Bi, Aged about 45 years, Beside of Madipadu Mandal Office, Madipadu Village and Mandal, Bapatla District.
55. Shaik Suleman S/o.Late Shaik Khasim Bi, Aged about 43 years, Medical Shop, Thallur Road, Vellampalli Village, Madipadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.24
56. Shaik Adil S/o.Akram, Aged about 45 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
57. Shaik Akhil S/o.Akram, Aged about 43 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
58. Shaik Afill S/o.Akram Aged about 41 years, R/o.Kothapet, Vijayawada, Krishna District. ...Respondent/Proposed Respondent No.25
59. Shaik Abdul Rehaman S/o.Shaik Mastan Bi, Aged about 45 years, Occ. Tailer R/o.Vellampalli Village, Madipadu Manadal, Bapatla District.
60. Shaik Alla Bakshi S/o.Shaik Mastan Bi, Aged about 42 years, Occ.Teacher R/o Vellampalli Village, Madipadu Manadal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.26

Please take notice that the above appellants filed the above case against you, for your appearance in the above court, where you are requested to appear before the Honourable High Court, Amaravathi either personally or through an advocate on 15-09-2025 at 10.30 A.M. in the above said case, failing which the matter will be heard and determined in your absence on merits.

(By order of the Honourable Court)

KRUPA CHAND GOGINENI
VARUN CHOWDARY. GOGINENI
Advocates
Flat No 208, "A" Block, Capital Square Appt, Sai Bharthi Nagar, Koppuravuru, Kantaru cross Road, Guntur Dist:- 522507



ఇక వివరాలన్నీ పక్కా

● స్వయం సహాయక సంఘాలకు లోకోస్ యాప్

సత్తెనపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలకు చెందిన సమగ్ర లావాదేవీలు, సమావేశాలు తదితర వివరాలన్నీ ఒకే చోట కేంద్రీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లోకోస్ యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు మహిళలకు పూర్తి స్థాయిలో సమాచారం అందించేందుకు 2023లో దీనిని పోర్టల్ రూపంలో తీసుకు వచ్చింది. ఐతే అప్పట్లో నిర్వహణకు గత ప్రభుత్వం వెనుకడుగు వేసింది. దీంతో క్షేత్ర స్థాయికి చేరలేదు. కూటమి ప్రభుత్వం రాకతో ఈ యాప్‌ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఇప్పటికే మండల, గ్రామ స్థాయిలో వీవోల నుంచి అధికారుల వరకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు.

ఎక్కడి నుంచైనా

సిబ్బందికి శిక్షణ పూర్తయ్యాక వివరాలన్నీ యాప్‌లో కన్పించనున్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ప్లే స్టోర్ ద్వారా ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడి నుంచైనా వివరాలు చూసుకోవచ్చు. సంఘాలతో పాటు జీవనోపాధుల ఫోటోలు, ఇతర వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఆర్థిక స్థితి గతులు తెలుస్తాయి.

ఉపయోగాలు ఇవి....

పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, శ్రీనిధి, పెట్టుబడి సాయం, పొదుపు నిల్వ, అంతర్గత అప్పులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమావేశాలు, తీర్మానాలు, రుణాలు, వసూళ్ళు, బ్యాంకులకు చెల్లింపులు తదితర వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ లాంటి పథకాల గురించి కూడా తెలుసుకోవచ్చు. పారదర్శక సేవల్లో భాగంగా ఇటీవల రాష్ట్రంలో తీసుకు వచ్చిన మన డబ్బులు, మన లెక్కలు యాప్‌కు ఇది అనుసంధానంగా పని చేస్తుంది.

దేశ మంతటా ఒకేలా...

పొదుపు సంఘాలకు మంజూరవుతున్న రుణాల్లో కేంద్రం వాటా 60 శాతం, జాతీయ గ్రామీణ లైవ్లీ ఉడ్ మిషన్ పథకం కింద నిధులు ఇస్తుంది. రాష్ట్రంలో దీనికి అనుబంధంగా ఎస్ఎస్ఆర్ఎల్ అమలవుతుంది. సెర్ప్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఇతర రాష్ట్రాల్లోనే వివిధ విభాగాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో దేశం మొత్తం వివరాలు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా లోకోస్ యాప్‌ను ప్రభుత్వం తీసుకు వచ్చింది.

కష్టనష్టాల కలనేత.. చేనేత!

● ఆసరా కోసం ఆశగా చూస్తున్న నేతన్నలు
● పవర్ లూమ్ ధాటికి కొన ఊపిరిలో చేతిమగ్గం



గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రెక్కల కష్టం మీద బతికే నేతన్నలు ఎప్పుడూ ఉచితాలను కోరుకోలేదు. వారు కోరుకునేదల్లా చేతినిండా పని, పనికి తగిన మజూరీ మాత్రమే! కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న దాఖలాలు లేవు. పైపెచ్చు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు స్వయం ప్రకాశిత చేనేతను చిదిమేశాయనే చెప్పాలి. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల తాలూకు దుష్ఫలితాలు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మూడు జిల్లాల్లో ఉన్న 50 వేల కుంటుంబాలు ప్రమాదపుటంచుల వరకూ వెళ్లిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా ఈ రంగం నిరాదరణకు గురి కావడంతో కొన్ని వేల కుటుంబాలు వృత్తికి దూరమయ్యాయి. గత ప్రభుత్వం ఇచ్చినట్లు పప్పు బెల్లాల పంపకం కాకుండా, తమకు జీవితాంతం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం నిర్దిష్ట కార్యక్రమం తీసుకోవాలని కోరుకుంటున్నారు.

● చేనేత మార్కెట్‌ను ఆక్రమించిన పవర్‌లూమ్..

గడిచిన రెండు దశాబ్దాల్లో చేనేత కోలుకోలేనంతగా దెబ్బతింది. అందుకు కారణం పవర్‌లూమ్ పరిశ్రమ. చేనేత మగ్గాలపై నేత కళాకారులు రూపొందించిన వస్త్రాలను ఆ మరుసటి రోజు నుంచే పవర్ మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని చేనేత వస్త్రాలుగా బహిరంగ మార్కెట్లో తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. దీంతో చేనేత మార్కెట్‌ను పవర్‌లూమ్ మార్కెట్ ఆక్రమించింది. గతంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసే పవర్‌లూమ్ వస్త్రాలను.. ఇప్పుడు నేరుగా బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, గుంటూరు జిల్లా మంగళగిరి, పల్నాడు జిల్లా చిలకలూరిపేట సహా అనేక ప్రాంతాల్లో పవర్ మగ్గాలు పెట్టి, అక్కడే భారీగా ఉత్పత్తి చేసి.. చేనేత వస్త్రాలుగా మార్కెట్లోకి వదిలేస్తున్నారు. దురదృష్టమేంటంటే అవే పవర్ లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాలుగా రాష్ట్ర ప్రభుత్వ సహకార సంస్థ ఆప్కో కూడా విక్రయిస్తోంది. దీనిపై చేనేత కార్మికులు అధికారులకు, ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. చేనేత వస్త్రాలు సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల దగ్గర నిలిచిపోయాయి. ఈ కారణంగా మూడింట ఒక కుటుంబం నేతను వదిలి వేరే పనులకు వెళుతున్నారని తెలుస్తోంది.

● తాయిలాలతో సరిపుచ్చిన గత ప్రభుత్వం

చేనేత రంగం చితికిపోతున్న దశలో ఉన్నాగానీ గత ప్రభుత్వం పట్టనట్లు వదిలేసింది. కేవలం నేతన్న నేస్తం పేరుతో నూటికి పది మందికి తాయిలాలు పంచుతూ అదే నేతన్నల సమస్యలన్నింటికీ పరిష్కారమన్న చందంగా వ్యవహరించింది. ఫలితంగా చేనేత రంగమే అంతరించిపోయే పరిస్థితి దాపురించింది. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో చేనేత వాటా దారుణంగా పడిపోయింది. కిందటేడాది కేంద్ర బడ్జెట్లో చేనేతకు రూ. 200 కోట్లు కేటాయించారు. కానీ దానిని సవరణ బడ్జెట్లో రూ.190 కోట్లకు తగ్గించారు. తాజాగా 2024- 25 బడ్జెట్లో కూడా అవే రూ.200 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. మొత్తంగా జౌళీ శాఖకు కేంద్రం రూ.4,392.85 కోట్లు కేటాయించగా అందులో చేనేతకు 4.5 శాతం మాత్రమే నిర్దేశించారు. చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సబ్సిడీ, చేనేత క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం, సేవా కేంద్రం, మ్యూజియం తదితర పథకాలకు మాత్రమే ఆ నిధులు సరిపోతాయి. కాగా గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చేనేతకు బడ్జెట్ కేటాయించలేదు. కేవలం రూ. 200 కోట్లు కేటాయించి వాటిని ఉద్యోగుల జీతభత్యాలు, నేతన్న నేస్తానికి ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో వచ్చే రాష్ట్ర బడ్జెట్‌పై నేతన్నలు భారీగా ఆశలు పెట్టుకున్నారు.

● ప్రభుత్వం పూనుకుంటే మహర్దశే!

స్వయంపోషక చేనేత పరిశ్రమకు ఏ ప్రభుత్వమైనా



పెద్దగా చేయాల్సింది ఏమీ లేదు. చేనేత కార్మికులు కోరుకునేది తీర్చలేని కోరిక కాదు. వారు కోరుకునేదల్లా చేనేత మార్కెట్‌ను సంరక్షించడం. అద్భుతమైన హస్త కళా శిల్పాలను పవర్‌లూమ్ మగ్గాలపై ఉత్పత్తి చేయకుండా చూస్తే చాలు. నూతన జౌళీ విధానంలో భాగంగా చేనేతకు కేటాయించిన చీరెలు, దోవతులు, పంచెలు, తువ్వాళ్లు వంటి 11 రకాలను చేనేత మీదే ఉత్పత్తి అయ్యేలా చట్టాన్ని అమలు చేయాలి. పురాతన కుటీర పరిశ్రమ కాబట్టి వాణిజ్య దృష్టితో చూడకుండా చేనేతకు కావాల్సిన ముడి సరుకులపై పన్నులు, సుంకాలు, జీఎస్టీలు తొలగించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించింది కానీ, ముడి సరుకులపై జీఎస్టీ కొనసాగుతోంది. ఫలితంగా ఉత్పాదక వ్యయం పెరిగి చేనేత బట్ట రేటు ఎక్కువవుతోంది. చేనేతకు కావాల్సిన చిలప నూలును ప్రతి నూలు మిల్లు 50 శాతం తయారయ్యేలా చూడాలని నేతన్నలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పవర్లూమ్ వస్త్రాల కారణంగా దెబ్బతిన్న చేనేత మార్కెట్ ప్రతిష్టను పునరుద్ధరించాలి. చేనేతకు ట్రేడ్ మార్కు కేటాయించాలి.

● మద్ధతు ధర కల్పించి ఆదుకోవాలి

వ్యవసాయరంగంలో మద్ధతు ధర ప్రకటించి రైతులను కాపాడినట్లే చేనేత కార్మికులను కాపాడేందుకు ప్రభుత్వం మద్ధతు ధర విధానాన్ని అమలు చేయాలని నేతన్నలు బలంగా కోరుతున్నారు. చేనేత వస్త్రాల ఉత్పాదక వ్యయం, కార్మికుల శ్రమ విలువను లెక్కగట్టి వస్త్రాలకు ధరలను నిర్ణయించి, ఆ ధరల ప్రకారమే మార్కెట్‌ను నిర్వహించాలి. చేనేత కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యేలా చూడాలి. గత కొన్నేళ్లుగా సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల వద్ద నిలిచిపోయిన ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయించాలి. రైతులకు అన్నదాత సుఖీభవ అందజేస్తూ భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం స్వయం ఉపాధి రంగమైన చేనేతకు కూడా అలాంటి భరోసా కల్పించాలి.

● ఘోరంగా దెబ్బతిన్న చేనేత మార్కెట్

చేనేత వస్త్రం అనేది ఒక బ్రాండ్ ఇమేజ్ ఉన్న ఉత్పత్తి. గత వైసీపీ హయాంలో చేనేత పేరుతో మార్కెట్లోకి వచ్చిన పవర్‌లూమ్ ఉత్పత్తులను కొన్న వినియోగదారులు ఘోరంగా మోసపోయారు. మోసపోయిన వినియోగదారులు చేనేత ఏదో.. నకిలీ ఏదో గుర్తించలేక చేనేత వస్త్రాలను కొనడమే మానేసే పరిస్థితికి వచ్చారు. ఫలితంగా హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, ముంబై, ఢిల్లీలలో ఉన్న అతిపెద్ద చేనేత మార్కెట్లన్నీ తమకు చేనేత వస్త్రాలు వద్దని బోర్డులు పెట్టాయి. ఫలితంగా రెండేళ్లుగా చేనేత ఉత్పత్తులన్నీ ఉత్పత్తిదారుల దగ్గరే ఆగిపోయి, గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో మాస్టర్ వీవర్లు ఉత్పత్తిని నిలిపివేశారు. కార్మికులకు పని కల్పించడం ఆపేశారు. మరో వైపు 2020లో వచ్చిన కరోనా చేనేతను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్మికులకు ఉపాధి లేకుండా చేసింది. కరోనా వంకతో ఉత్పత్తిదారులు కార్మికులకు పని కల్పించలేదు. కరోనా అనంతర కాలంలో చేనేత సంరక్షణకు చేపట్టాల్సిన కనీస చర్యలు కూడా అప్పటి వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో యజమానులు కార్మికుల శ్రమను ఘోరంగా దోచుకున్నారు. గతంలో ఇచ్చే మజూరీల కంటే సగానికి సగం కూలీలు(మజూరీలు) తగ్గించి ఇచ్చారు. తాజా గణాంకాల ప్రకారం చేనేత మగ్గాల సంఖ్య సగానికిపైగా తగ్గినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై తక్షణం ప్రభుత్వం దృష్టిపెట్టాల్సి ఉంది.

● కూటమి సర్కారుపైనే నేతన్నల ఆశలు

తాజాగా చేనేత దినోత్సవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరిలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు జిల్లాల నేతన్నల్లో ఎన్నో ఆశలు కనిపిస్తున్నాయి. పోయిన ఐదేళ్లలో యువనేత నారా లోకేశ్ చేనేతను సంరక్షించేందుకు మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. అధికారం, పదవి లేకపోయినా సొంత నిధులతో నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించడం తోపాటు, మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంగళగిరిని నమూనాగా తీసుకుని ప్రముఖ చేనేత కారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేశారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైన, ప్రత్యేకించి యువనేత లోకేశ్‌పైన నేతన్నలు ఆశలు పెంచుకున్నారు. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ పరంగా సమగ్ర కార్యక్రమాన్ని అమలు చేసి చేనేత సంరక్షణ చేపట్టాలని నేతన్నలు వేడుకుంటున్నారు.

తెనాలి-చందోలు రహదారి అధ్వానం


చందోలు మార్గంలో సగం రహదారి కుంగిపోయిన దృశ్యం


పెదపూడి వంతెన వద్ద కుంగిపోయిన రోడ్డు


మండూరు వంతెన వద్ద కోతకు గురై వంకర్లు తిరిగిన రహదారి

తెనాలి అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అధ్వానమైన రోడ్లతో నానా ఇక్కట్లు పడ్డాం, ప్రభుత్వం మారిన వెంటనే రోడ్లు బాగుపడతాయనే ఆనందం అట్టే నిలబడలేదని ప్రయాణికులు వాపోతున్నారు. తెనాలి-చందోలు మార్గంలో కృష్ణా పశ్చిమ డివిజన్, తూర్పు, పడమర నిజాంపట్నం కాల్వల మధ్య ఉన్న రహదారి పలుచోట్ల కోతకు గురికావడం, కుంగిపోవడం, గుంతలతో అధ్వానంగా, ప్రయాణాన్ని నరకం చేస్తోంది. పెదరావూరు-కూచిపూడి మధ్య గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడిన సమయంలో ఈ గుంతల్లో నీరు నిలిచి ఎక్కడ ఏముందో తెలియకుండా పోతోంది. ద్విచక్ర వాహనాలే ప్రయాణం చేయలేకపోతుంటే పెద్ద వాహనాల్లో వెళుతున్న వారి పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. మండూరు వంతెన -పెదపూడి వంతెనల మధ్య రహదారి అంచులు విరిగిపోయి అష్ట వంకర్లు కనిపిస్తున్నాయి. వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో ఎదురెదురు వెళుతున్నవారు బాగున్న మార్గంలోనే వెళ్లే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదపూడి వంతెన వద్ద కాల్వ వెంబడి నిర్మించిన రిటైనింగ్ వాల్ ఒరిగిపోవడంతో ఓ వంద మీటర్ల మేర కుంగిపోయిన రహదారిని చక్కదిద్దడానికి పలుమార్లు ఆర్ అండ్ బీ శాఖ కేటాయించిన నిధులు ఉపయోగం లేకుండా పోయాయి. ఇక్కడ రహదారిని చక్కదిద్దే లోపే మరికొంత దూరంలో మరో వంద మీటర్ల మేర రహదారి సగం కుంగిపోయి ప్రమాద భరితంగా మారింది. రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం కొనితెచ్చుకున్న వారవుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఈ మార్గంలో రోడ్లు దెబ్బతిన్న చోట కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఆరు నెలల్లో రోడ్లు వేస్తామనే బ్యానర్లు కట్టారని, ఏడాదిన్నర అయినా అతీగతీ లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఘనంగా ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ 9వ ఆవిర్భావ దినోత్సవాలు గుంటూరు నగరంపాలెం లోనున్న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణప్రభు చేతుల మీదుగా మాతృశ్రీ అనాధ శరణాలయం విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చీఫ్ రీజనల్ కార్యదర్శి జయకుమార్ మాట్లాడుతూ సభ్యుల హక్కులను కాపాడటంతో పాటు జీతభత్యాలు పెంపు సంబంధిత అన్ని విషయాలకు వెన్నంటి ఉండి సభ్యుల అభ్యున్నతికి అసోసియేషన్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎమ్ రామ్‌ప్రసాద్, తారకేశ్వరరావు, సంఘ నాయకులు కోటిరెడ్డి, వీరాంజనేయులు, సునీల్, రతన్‌రాజ్, కళ్యాణ్, బషీర్ అహ్మద్, తదితరులున్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీజీఎం కృష్ణప్రభు, జయకుమార్ తదితరులు

మోతడకలో పికిల్ హబ్

● రూ.20 కోట్లతో ఏర్పాట్లు
● పరిశీలించిన అధికారుల బృందం


మోతడకలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు

తాడికొండ(మోతడక), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల కింద మోతడక గ్రామంలో రూ.20 కోట్లతో పికిల్ హబ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించటానికి న్యూఢిల్లీ డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు బుధవారం తాడికొండ మండలంలో పర్యటించారు. రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న మోతడకలో కామన్ ఫెసిలిటి సెంటర్ ఏర్పాటుకు ఎంఎస్ఎమ్ఈ ద్వారా ఎన్నార్ఎల్ఎం కింద పికిల్ హబ్ ఏర్పాటుకు నాలుగు ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ, కామన్ ఫెసిలిటి హబ్‌ను రూ. 20 కోట్లతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ నుంచి వచ్చిన అరవింద పటేద్ మాట్లాడుతూ రాజధాని అమరావతి చుట్టు పక్కల మిర్చి సాగు ఎక్కువగా ఉన్నదని, మిర్చి ద్వారా 120 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చనని తెలిపారు. అలాగే మామిడి, మిర్చి, గోంగూర, ఉసిరి కాయల ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో వలన పచ్చళ్ళ తయారు చేసి ఎగుమతులు చేసేందుకు హబ్‌గా నిర్మించటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. డ్వాక్రా సంఘాలు, రైతుల ద్వారా పచ్చళ్ళ, కారంపొడులు తయారు చేయించి మార్కెటింగ్ ద్వారా ఎగుమతులు చేయటం జరుగుతుందన్నారు. దీని ద్వారా డ్వాక్రా మహిళలు, రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించటమే ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. బండారుపల్లి, నిడుముక్కల గ్రామాల్లో డ్వాకా మహిళలు తయారు చేస్తున్న పచ్చళ్ల, కారంపొడుల యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు జనార్థన్‌రూట్, ఎన్ఐఆర్డీ హైదరాబాద్ నుంచి గోపాలకృష్ణ, స్టేట్ ఆఫీస్ సెర్ప్ లైవ్లీహుడ్ డైరెక్టర్ శివశంకర్‌ప్రసాద్, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మీ, ఏపీడీలు కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, పీ.ఈ శేఖర్, ఏపీఎం సాంబశివరావు, సర్పంచ్ శివపార్వతి, టీడీపీ నాయకులు కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి పార్వతి, తహసీల్దార్ మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీజేపీ శోభాయాత్ర

బాపట్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు బాపట్లలో ఘనస్వాగతం లభించింది. బుధవారం బాపట్లలో ఆయన పర్యటన నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు హాజరై శోభాయాత్ర విజయవంతం చేశారు. బీజేపీనాయకులు గజమాలలతో ఆయనను సత్కరించారు.


బాపట్లలో కార్యకర్తలతో భారీ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు మాధవ్

పూర్తయితే.. రాచ మార్గాలే..

● రూ. 930 కోట్లు మంజూరు చేసిన కేంద్ర జాతీయ రహదారుల శాఖ
● ఇప్పటికే వర్చువల్ విధానంలో పునాదిరాయి వేసిన మంత్రి గడ్కరీ
● వేగవంతంగా పనులు జరిగితేనే ప్రజలకు మేలు



గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే శంకుస్థాపన చేసిన పనులు పూర్తి అయితే ఉమ్మడి జిల్లాలో అవి రాచమార్గాలుగా మారిపోతాయి. రవాణ వ్యవస్థ మెరుగుపడి ఆర్థికంగా ఊతమిస్తుంది. ముఖ్యంగా పోర్టులకు కనెక్టివిటీ పెరిగి లాజిస్టిక్ హబ్‌లుగా ఆయా ప్రాంతాలు తయారవుతాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఎన్‌హెచ్ అధికారులు అన్ని అనుమతులు తీసుకొని పనులు గ్రౌండింగ్ జరిగేలా చూడాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లలో ముఖ్యంగా జాతీయ రహదారులు బావుంటేనే అభివృద్ధికి అడుగులు పడతాయి. అంతేకాకుండా ప్రస్తుతం ఎక్కువగా జరుగుతోన్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా నిలుస్తాయి.

- ఎన్‌హెచ్ - 167ఏలో చిలకలూరిపేట - నకరికల్లు సెక్షన్ ఎంతో కీలకమైనది. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించి బఫర్ జోన్‌లు కూడా ఏర్పాటు చేస్తారు. మొత్తం 38 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేయనున్న ఈ ఎన్‌హెచ్‌కు రూ. 787 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ రోడ్డులో రెండు బైపాసులు, ఒక ట్రక్ లేబే, ఒక బస్ బే, 10 షెల్టర్లు, మూడు మేజర్, 10 మైనర్ బ్రిడ్జీలు, ఒక ఆర్‌వోబీ, ఇంటర్‌చేంజ్, మూడు వీయూపీలు, 51 కల్వర్టులు, ఒక టోల్ ప్లాజా, ఐదు జంక్షన్లు, 17 మైనర్ జంక్షన్లను అభివృద్ధి చేస్తారు. దీని వలన హైదరబాద్ నుంచి వోడరేవు, సూర్యలంక బీచ్‌లకు ప్రయాణ సమయం తగ్గుతుంది. అలానే కోటప్పకొండ, కొండవీడు పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది.
- ఎన్‌హెచ్ - 167 ఏడీలో మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాల బైపాస్‌లను 13 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ. 54 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో 9 మైనర్ జంక్షన్లు, 4.325 కిలోమీటర్ల పొడవునా ఆర్‌సీసీ డ్రెయిన్, 2.825 కిలోమీటర్ల పొడవునా పేవర్ బ్లాక్స్ వంటివి చేపడతారు. దీని వలన మాచర్ల, రెంటచింతల, గురజాలలో రద్దీ తగ్గుతుంది. అంతేకాకుండా ప్రయాణ వేగం పెరగడం, కాలూష్యం తగ్గడం జరుగుతుంది.
- ఎన్‌హెచ్-16లో చిలకలూరిపేట-విజయవాడ సెక్షన్ మధ్య 406+300 కిలోమీటర్(ఎల్‌హెచ్ఎస్) వద్ద మూడు వరసల ఆర్‌వోబీని అభివృద్ధి చేసేందుకు మంత్రి పునాదిరాయి వేశారు. కిలోమీటర్ పొడవునా నిర్మించనున్న ఈ ఆర్‌వోబీకి రూ. 29 కోట్లు మంజూరయ్యాయి. ఒక ఆర్‌వోబీతో పాటు మూడు కల్వర్టులు నిర్మిస్తారు. ప్రస్తుతం రెండు వరసల ఆర్‌వోబీ మాత్రమే ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది మూడు వరసలకు విస్తరించడం వలన బ్లాక్‌స్పాట్ తొలగిపోతుంది. అలానే ప్రయాణ వేగం పెరుగుతుంది. ఎన్‌హెచ్-16 లోనే 431+415 కిలోమీటర్(ఎల్‌హెచ్ఎస్) వద్ద మూడు వరసల ఆర్‌వోబీని రూ.60కోట్లతో కిలోమీటర్ పొడవునా నిర్మిస్తారు. దీని వలన కూడా మేజర్ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ తొలగిపోతుంది.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని రవాణా శాఖ కార్యాలయంలో అసంఘటిత కార్మికుల కోసం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయాధికారి ఇబ్రహీషరీఫ్ మాట్లాడుతు వాహన యజమానులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. అదేవిధంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రమాదాలు జరిగిన సమయంలో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీలు బాధితులకు తమ వయస్సు, చేసే ఉద్యోగం లెక్కకట్టి పరిహారం అందజేస్తాయని పేర్కొన్నారు. వాహనచోదన చేసే సమయంలో తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ భవానీ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దీనిని ఉచితంగానే చేస్తారని, 16 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. తద్వారా ప్రభుత్వం కల్పించే సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 17వ తేదీ వరకు కార్మికశాఖ ప్రత్యేక రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిందని, జిల్లాలో కార్మికులు అందరు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఆటోలలో డీజే సౌండ్స్ పెట్టి వాహనలు నడపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ లైసెన్స్ వాహనంనకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింగరావు, బాలల హక్కుల పరిరక్షణ అధికారి దినేష్, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారమవుతున్న తీరుతోపాటు పౌరసరఫరాలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారన్నారు. ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల విషయంలో పెండింగ్ ఉండరాదన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. దుకాణాల ద్వారానూ, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీలో పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్వో చిన ఒబులేషు, వివిధశాఖల అధికారులు పద్మశ్రీ, వరలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో రవి, గ్రీవెన్స్ ఆడిట్ బృంద సభ్యులు, ఇతర అధికారులు ఉన్నారు.



సీతారామయ్యను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పీడీసీసీ బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం

ఒంగోలు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ పనితీరు చూపినందుకు, వ్యాపార లావాదేవీలను గణనీయంగా పెంచినందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(పీడీసీసీ)కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. బ్యాంకు సేవలకు గుర్తింపుగా బ్యాంకు పీఐసీ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సత్కరించారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆప్కాబ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లాకు ఈ అరుదైన గౌరవం లభించింది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన డీసీసీబీలు, సొసైటీలను ఎంపిక చేసి ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సౌత్ జోన్‌లో మెరుగైన పనితీరుతో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 2025 మార్చి ఆఖరుకు పీడీసీసీ బ్యాంకు రూ.3434 కోట్ల వ్యాపారం చేసింది. ఈ మొత్తంలో రూ.866 కోట్లు డిపాజిట్లు కాగా రూ.2568 కోట్ల రుణాలు పంపిణీ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖలమంత్రి కింజారపు అచ్చెనాయుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గ్రంధి వీరాంజనేయులు చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా అవార్డును బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ సీతారామయ్యకు అందజేశారు. అనంతరం డాక్టర్ సీతారామయ్యను శాలువ, మెమెంటోను సత్కరించారు. డీసీసీబీలు, సొసైటీలను పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేసి రైతులకు, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, అందుకోసం కార్యాచరణను రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బ్యాంకు సీఈవో ప్రకాష్ కూడా మెమొంటోను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ ఏ.బాబు, 13 జిల్లాల డీసీసీబీల ఛైర్మన్లు ఉన్నారు.

కడలూరు, కారైకల్ బోట్లను కట్టడి చేద్దాం

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి
● తరలివచ్చిన నాలుగు జిల్లాల గంగపుత్రులు
● జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లను సమష్టిగా కట్టడి చేద్దామని నాలుగు జిల్లాల మత్స్యకార పెద్దలు, కాపులు నిర్ణయం తీసుకున్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించిన తీరప్రాంత మత్స్యకార గ్రామకాపులు, పెద్దలతో బుధవారం పొద్దుపోయాక నిర్వహించిన సమావేశంలో 160 మత్స్యకార గ్రామాలకు చెందిన గంగపుత్రులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కడలూరు, కారైకాల్ బోట్లు అనుమతులు లేకుండా ఆంధ్ర సముద్ర తీరంలో మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లతో అక్రమంగా చేపల వేట సాగించడాన్ని అరికట్టేందుకు తమ అభిప్రాయాలను తెలియచేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 31వ తేదీన ఇందుకూరుపేట మండలం కృష్ణాపురం వద్ద సముద్ర చేపల వేటకు కడలూరు మెటనైజ్డ్ హెవీమోటర్ బోటు వచ్చిందని, స్థానిక మత్స్యకారులు ప్రాణాలకు తెగించి ఆ బోటును అడ్డగించి తీరం చేర్చుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తీరప్రాంత మత్స్యకార పెద్దలకు సమాచారం తెలియచేసి ఆగస్టు 1వ తేదీన కాపుల నిర్ణయం మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారులచే కడలూరు బోటులోని చేపల వేటకు వచ్చిన వారిని పంపించినట్లు తెలిపారు. అందరి నిర్ణయం మేరకు కడలూరు బోటును 2న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చామన్నారు. కడలూరు, కారైకల్ హెవీమోటర్ బోట్లను ఎదుర్కోవడానికి ఫైబర్ బోట్ల సామర్థ్యం చాలదని, అందరి సహాయ సహకారాలతో మెటనైజ్డ్ బోటుతో సముద్రంలో కాపలా కాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మెటనైజ్డ్ బోటు కొనుగోలు చేయాలంటే రూ.1.5 కోట్లకుపైగా అవుతుందని పెద్దలు అంటున్నారు. కడలూరు, కారైకల్ బోట్లను ఎదురించేందుకు రెండేళ్ల క్రితం అల్లూరు మండలం ఇస్కపల్లిలో మత్స్యకారుల సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సముద్ర చేపల వేటలో మనవారి ఫైబర్‌బోట్లు, వలలను చాలాసార్లు ధ్వంసం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి కాబట్టి తమిళనాడు బోట్లను కడలూరు బోటుతోనే ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో అధికారులు మత్స్యకారులకు సహకరించాలని నాలుగు జిల్లాల గంగపుత్రులు కోరారు.





సమావేశానికి హాజరైన తీరప్రాంతాల గంగపుత్రులు (ఇన్‌సెట్లో) జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

● డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు

మార్టూరు,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని, వివిధ రకాలైన కషాయాలు, ద్రవ జీవామృతం,ఘన జీవామృతం వాడుకను మెరుగుపరచాలని డీఏవో ఎం. సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కోలలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశానికి ఏడీఏ కె. సుదర్శన రాజు అధ్యక్షత వహించారు. అనంతరం డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు,పురుగుమందుల వాడకం తగ్గించి, భూమిలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంపొందించడానికి ప్రకృతి వ్యవసాయం మార్గమన్నారు. అదేవిధంగా సొసైటీ ద్వారా ఎరువులను పంపిణీ చేయాలని రైతులు అధికారులను కోరారు. అంతకు ముందు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేసిన రైతు సాంబశివరావు మొక్కజొన్న పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సర్పంచ్ ఎం. సతీష్ కుమార్,మాజీ ఎంపీటీసీ తాటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



కోలలపూడి గ్రామంలో మినుము విత్తనాల కిట్‌ను రైతుకు అందజేస్తున్న డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు, ఏడీఏ సుదర్శనరాజు తదితరులు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రతి రెండు లేక మూడు సంవత్సరాలకు భూసారపరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కుమారి అన్నారు.బుధవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి, పెద్దివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ,మినుము, జొన్న, మొక్కజొన్న వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట శివ, ఎంపీటీసీ సాంబశివరావు,పెద్దివారిపాలెం సర్పంచ్ వెంకటసుబ్బయ్య, వీఏఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పంగులూరు : పంటసాగులో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరించడం లాభదాయకమని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కశ్యాపురం, రేణంగివరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హులందరికీ వర్తిస్తుందని, ఆధార్‌లో తప్పులున్న వారు వాటిని సవరించుకుని తగిన లబ్ధిపొందవచ్చన్నారు. స్థానిక రైతులతో కలసి సాగులోఉన్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు ఓబుల్‌రెడ్డి, నారాయణస్వామి, నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

దళారుల దందా!

(5వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూములన్న వంకతో వారి భూములను కారు చౌకగా కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దళారుల దందాలో ఎంతోమంది సామాన్య రైతులు రూ.లక్షలకు లక్షలు నష్టపోతున్నారు.

● అసైన్డ్ రైతుల ప్లాట్లే టార్గెట్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసమీకరణ చేశారు. 29వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు.. 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వారి భూములపై సీఐడీ కేసులు వేసిన గత ప్రభుత్వం.. వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ భూములకు సర్వహక్కులు కల్పించింది. రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు కూడా 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని చెబుతూ గజంపై రూ.10వేలు నుంచి రూ.20 వేల తగ్గిస్తున్నారు.

● సీఎం దృష్టికి వ్యవహారం

దళారుల దోపిడీనీ రాజధాని రైతులు ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికే తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం ప్రభుత్వం రిజిస్టర్ చేసి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అసైన్డ్ ఎలా అవుతాయి అంటూ సీఆర్డీఏ అధికారులను ప్రశ్నించారు. దానిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ దళారుల దందా తగ్గలేదు. ఇప్పటికీ అదే దోపిడీ కొనసాగుతోంది.

● సీఆర్డీఏ స్పందించకుంటే నష్టమే

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన దస్తావేజుల్లో ఉన్న ఒక చిన్న సాంకేతిక అంశాన్ని ఆసరా చేసుకుని దళారులు దోపిడీ చేయడంపై ప్రభుత్వం, సీఆర్డీఏ తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. భూమి స్వభావం అనే కాలమ్‌లో 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే సీఆర్డీఏ అధికారులు, సంబంధిత మంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన, దళారులకు హెచ్చరిక చేయాలని కోరుతున్నారు.

సర్దుబాటు ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు నడుస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు సక్రమంగా లేకపోవడంతో ఒక్కో పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు. ఆయా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మండలాల వారీగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల సంఖ్యను తెలియజేయాలని కోరుతూ ఎంఈఓలకు, డిప్యూటీ ఈఓలకు విద్యాశాఖ నుంచి లేఖలు వెళ్లాయి. దీంతో వెంటనే మండల స్థాయిలో ఉన్న పాఠశాలలను పరిశీలించి ఎంఈఓలు ఖాళీల వివరాలను సేకరించారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో 60 పైగా ఖాళీలు ఉన్నట్లు తేలింది. ఇక్కడ పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులని సమీపంలోని ఉన్నత పాఠశాలలు లేదా ప్రాథమిక పాఠశాలలో సర్దుబాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఈలోగా బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టారు. బదిలీల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా.. సర్దుబాటు ప్రక్రియపై విద్యాశాఖ దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

రమణాయపాలెం(పర్చూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు సంపూర్ణ ఆరోగ్యమని బిడ్డ పుట్టిన వెంటనే తప్పక తాగించాలని సూపర్ వైజర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని రమణాయపాలెం గ్రామంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో కార్యకర్త అంగమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకోండి

మార్టూరు : బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని సూపర్ వైజరు పద్మ అన్నారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో బుధవారం ద్రోణాదుల సెక్టారు పరిధిలోని అంగనవాడీ కార్యకర్తలు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివకుమారి, ఎంఎస్‌కె సుజాత, అంగనవాడీ కార్యకర్తలు ఎ కోటేశ్వరమ్మ,ఎ శ్రీదేవి,ఆశా కార్యకర్తలు స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం

చినగంజాం : బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను అందిస్తే వ్యాధులు దరి చేరవని, వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని సంతరావూరు వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ అన్నారు. కడవకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం తల్లిపాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే.ఉషాకుమారి, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చినగంజాం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతరావూరు వైద్యాధికారి కీర్తి సరోజ్

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు

పంగులూరు :పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతోమేలని వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. మండలంలోని ముప్పవరం ఉపకేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీలు సుధ, శ్యామల, ప్రసన్న, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం

చీరాల : స్వచ్ఛమైన ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డ జన్మించాక గంటలోపే అందించాలని అంగన్వాడీ సీ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ముత్యాలపేట, గొల్లపాలెం, కటకం వారి వీధి, భావనాఋషి పేట, అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె తేజస్విని, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, కృష్ణకుమారి, భారతి, ప్రియాంక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవం మరియు ట్రీ ప్లాంటేన్ కార్యక్రమం సీడీపీవో సుధ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పీడీ రాధా మాధవి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిర్మల్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ టి. రమేష్, సూపర్‌వైజర్‌లు జి . ప్రమీల, సుష్మ రాణి , గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి హత్య?

● ఒంగోలు శివారులోని చెరువులో తేలిన మృతదేహం ● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతమైన అగ్రహారం సమీపంలోని రంగసాయికుంటలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం పోలీసులు దానిని బయటకు తీశారు. అయితే మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో యువకుడిని ఎక్కడో హత్య చేసి ఇక్కడి చెరువులో పడవేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. శరీరం అంతా కుళ్లిపోయి నీటిపై తేలడంతో పొలం పనులు చేసుకునే వారు ఇచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలుకా సీఐ విజయకృష్ణ తమ సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అదృశ్యమైన యువకుడు అతనేనా..?

గత నెల 27న నెల్లూరు జిల్లా బోగోలు మండలం చెన్నరాయునిపాలెంనకు చెందిన ధన్యాశి నవీన్ (25) అదృశ్యమయ్యాడు. ఈమేరకు కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదైంది. నవీన్‌కు కొత్తపట్నం మండలానికి చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆమె కోసం ఇప్పటికే పలుమార్లు ఆ గ్రామానికి వచ్చి ఆమె గురించి వాకాబు చేశాడు. అదేవిధంగా గత నెల 27న మోటార్‌సైకిల్‌పై వచ్చి ఇక్కడి యువతి గురించి వాకబు చేస్తుండగా ఆమె బంధువులు నవీన్‌ను చితకబాదారు. అప్పటి నుంచి నవీన్ కనిపించడం లేదు. దీంతో నవీన్ మోటార్‌సైకిల్, బ్యాగ్‌ను ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అదేక్రమంలో నవీన్ తల్లి ఈనెల 5న కొత్తపట్నం వచ్చి తన కుమారుడు గత నెల 27న వచ్చి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో కేసు నమోదు చేశారు. అయితే ఒంగోలు శివారులోని రంగసాయికుంటలో యువకుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించడంతో పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నవీన్‌ను హత్యచేసి కుంటలో పడవేసారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే యువతి బంధువులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే నవీన్ బంధువులను గురువారం ఒంగోలుకు రావాలని పోలీసులు కోరారు. వారు వచ్చి మృతదేహాన్ని గుర్తిస్తే కొన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు సహకార సంఘం ఎంపికయింది. 2024-25 ఏడాదికి గాను రైతులకు రుణాలు, ఎరువులను లక్ష్యం మేరకు అందించి ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉత్తమ సొసైటీగా అవార్డును అందుకొంది. బుధవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడి చేతులు మీదుగా ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, సీఈవో నన్నపనేని కోటేశ్వరరావు అవార్డులను అందుకున్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కుంకలమర్రు(పర్చూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. బుధవారం కారంచేడు మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలతోపాటు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యతో మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేత

మార్టూరు,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మార్టూరుకు చెందిన యలగాల వెంకటేష్ అనే బాలునికి 6 వేల రూపాయలు విలువచేసే వీల్‌చైర్‌ను అందజేశారు.దానికి బాల కోటిరెడ్డి ఆర్థిక సహకారం అందచేసినట్లు క్లబ్ అధ్యక్షులు సాంబశివరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి, జాష్టి సాంబ శివరావు, వంకాయలపాటి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన మరో లారీ

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ దెబ్బతినడమే కాకుండా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయడు. ఈ సంఘటన ఒంగోలు నగరం దశరాజుపల్లి వద్ద గల జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం జరిగింది. చెన్నయ్ నుంచి హుజూర్‌నగర్ మట్టంపల్లి వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వచ్చి కట్టర్‌సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. అయితే డ్రైవర్ ఎడమకాలుకు స్వల్పగాయమైంది. అబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అవీ.. ఇవీ



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే కొండయ్య

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగిస్తున్న చిన్నారులకు ఆదరణ అందిస్తామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాల ఐదుగురు, బాలికలు ఐదుగురికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విశ్రాంత ఆర్అండ్‌బీ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ చేగూడి వెంకట సుబ్బయ్య ఆర్థిక సహకారంతో బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో జిల్లాను రోల్ మోడల్‌గా ఉంచాలని సూచించారు. ప్రతి నిరుపేద విద్యార్థికి తోడుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుపై దృష్టి సారించడంతో పాటు మంచి క్రమశిక్షణతో మెలగాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాల బాల బాలికలకు బుధవారం సైబర్ సెక్యూరిటీ, రోడ్డు భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, శక్తియాప్‌తో కలిగే రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.హెచ్ఎం అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌బాబు, ఉపాధ్యాయులు మాట్లాడారు.

ఇటుక బట్టీలతో కాలుష్యం

● రోడ్ల వెంబడి పొగతో వాహనచోదకుల ఇక్కట్లు

● తరచూ ప్రమాదాలు

అద్దంకి,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): రోడ్ల వెంబడే ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తుండటంతో వెలువడే కాలుష్యంతో వాహనచోదకులు ఇబ్బం ది పడటంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకప్పుడు ఇటుక బట్టీలన్నీ అద్దంకి పట్టణం, తిమ్మాయపాలెంలలో అంతర్భాగంగా ఉండేవి. కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో పలు మార్లు ఆందోళనల తరువాత సుమారు 15 సంవత్సరాల క్రితం ఇటుక బట్టీలను దూరంగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో ఇటుక బట్టీల ఏర్పాటు సమయంలోనే కొన్ని నిబంధనలు కూడా రూపొందించి వాటికి అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొలుత కొంతమేర నిబంధనలు పాటించిన ఇటుక బట్టీల యజమానులు అనంతరం నిబంధనలు ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతూ వచ్చారు. ప్రస్తుతం ఇటుక బట్టీలు అత్యధిక శాతం రోడ్ల మార్జిన్ లోనే ఏర్పాటు అయ్యాయి. ఇటుక బట్టీల యజమానులకు ఆయా ప్రాంతాలలో ఎకరాల విస్తీర్ణంలో స్థలాలు ఉన్నా బట్టీలు మాత్రం రోడ్డు వెంబడే ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు రోడ్డు నుంచి సుమారు 100 అడుగుల దూరంలో మాత్రమే ఇటుక బట్టీలు



అద్దంకి-దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి కాలుష్యంతో ఉన్న ఇటుక బట్టీలు

ఏర్పాటు చేసుకోవాలి. ఇటుక బట్టీలకు, రోడ్డుకు మధ్యలో కాలుష్యం రోడ్డుపైకి రాకుండా మధ్యలో గ్రీనరీ పెంచాలి. అయితే ప్రస్తుతం ఉన్న ఇటుక బట్టీలను చూస్తే 100 మీటర్ల దూరం దేవుడెరుగు కనీసం ఒక్క మీటరు దూరం కూడా వదలటం లేదు. రోడ్డు మార్జిన్ స్థలాన్ని కూడా వదలకుండా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా అద్దంకి పట్టణానికి సమీపంలో అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం సమీపంలో అద్దంకి-దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం-కుంకుపాడు ఆర్ అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం-మారెళ్ళ రోడ్డు వెంబడి ఇటుక బట్టీలు ఉన్నాయి. ఇటుక బట్టీలు కాల్చే సమయంలో, లోడింగ్ సమయంలో దుమ్ము మొత్తం రోడ్ల పైకి వస్తుంది. దీంతో వాహనాల చోదకులు కళ్ళు మూసుకొని దేవుడి మీద భారం వేసి వాహనాలు నడపాల్సి వస్తుంది. ఆయా ప్రాంతాలలో జరిగే ప్రమాదాలలో ఎక్కువ శాతం దుమ్ములో ముందు వెళ్లే వాహనాలు, ఎదురు వచ్చే వాహనాలు గుర్తించలేక ఢీకొడుతున్నాయని పలువురు వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు ఇటుక బట్టీలను ఆయా రోడ్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డికి మెమెంటో అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు

చినగంజాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేష్‌లను మండల టీడీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక సీతారాముల దేవస్థానికి దేవదాయ శాఖ ద్వారా రెండు కోట్ల రూపాయిలు మంజూరు చేయించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని క్యాంపులో కార్యాలయంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, మెమెంటో అందజేశారు. వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లను వారి క్యాంపు కార్యాలయాలలో మర్యాద పూర్వకంగా నాయకులు కలిసారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటుమర్రి రామసుబ్బారావు, టి.జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, పల్లపోలు లక్ష్మీనారాయణ, శిఖరం సూరిబాబు, గంటా నరసింహారావు, వి.వెంకటరామానుజం పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులమంటూ ఫోన్లో ఉద్యోగులకు బెదిరింపులు

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హలో తాము ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీరు బాగా లంచాలు తీసుకుంటున్నారు అని మాకు ఫిర్యాదులు వచ్చాయి అంటూ ఉద్యోగులకు ఫోన్లు చేసి బెదిరింపులకు గురి చేస్తున్నారు. అదేంటి అని తిరిగి ప్రశ్నిస్తే ఏసీబీ డీఎస్పీ గారు చెప్పారు.. సీఐ గారు వస్తున్నారు మిమ్ముల్ని అరెస్టు చేస్తామంటూ చెప్పటంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బుధవారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఇన్‌చార్జి ఎంపీడీవోకు 8296692501 ఫోను నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీపై ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయి అని బెదిరించారు. వెంటనే అదే కార్యాలయంలో సీనియర్ సహాయకులకూ అదే నెంబర్ నుంచి ఫోను వచ్చింది. నేను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నాను మిమ్మల్ని అరెస్టు చేసేందుకు మా సీఐ వస్తున్నాడు.. మీరు ఎక్కడ ఉన్నారు అని కాల్ వచ్చింది. ఒక్కసారిగా ఆందోళన చెందిన అయన వెంటనే తేరుకొని రండి మేము కార్యాలయంలోనే ఉన్నాం అంటు తిరిగి సమాధానం చెప్పడంతో పాటు మేము పోలీసు స్టేషన్ వద్దకు వెళుతున్నాం అని చెప్పటంతో వెంటనే కాల్ కట్ చేశారు. కొద్ది సేపటికి శిక్షణలో ఉన్న ఎంపీడీవోకు అదే నెంబర్ నుంచి ఫోను చేసి ఉపాధి హామీ పథకంలో ఉన్న పై అధికారుల నెంబర్లు కావాలి నేను ఏసీబీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నాను అని చెప్పటంతో ఎంపీడీవో నేను కార్ డ్రైవింగ్‌లో ఉన్నాను అని చెప్పటంతో కాల్ కట్ చేశారు. వచ్చిన ఫోను నెంబర్‌కు ఉద్యోగులు ఫోన్లు చేస్తే ఎవరూ ఎత్తటం లేదని, ట్రూ కాలర్ ద్వారా చెక్ చేస్తే ఏఎస్ అని పేరు పెట్టి ఉందని వారు తెలిపారు. ఉద్యోగులను బెదిరింపులకు గురి చేసి వారి వద్ద నగదు కాజేయాలని ఎవరో ఇలా రోజూ ఫేక్ కాల్స్ చేస్తున్నారని పలువురు అంటున్నారు.

సీవీడ్ సాగుతో మత్స్యకారులకు జీవనోపాధి

● పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి



సీవీడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) :పెదగంజాం సముద్ర తీరప్రాంతంలో సీవీడ్ సాగుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని , దీని ద్వారా స్థానిక మత్స్యకారులకు, రైతులకు కొత్త ఆదాయ వనరులు ఏర్పడతాయని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటిమొగ గ్రామంలోని సీవీడ్ కల్చర్ యూనిట్‌ను(సముద్రపు నాచు పెంపకం) బుధవారం ఆయన సందర్శించి, సముద్రంలో రాఫ్ట్ అండ్ మోనోలిన్ సాగుపై సీవీడ్ ఎంటర్‌ప్రెన్యూర్ వాటాదారులతో మాట్లాడారు. సాగు విత్తనోత్పత్తి, మార్కెటింగ్, ప్రాసెసింగ్ తదితర అంశాలపై స్థానిక రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీరప్రాంతంలో సీవీడ్ సాగు స్వల్ప వ్యయంతో పర్యావరణానికి హాని లేకుండా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై రాఫ్ట్, పైపులు, వెదురుకర్రలు, ట్యూబ్‌లైన్ అందించేలా చొరవ చూపాలన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో జరుగుతున్న పోలేరమ్మ అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం నీలాయపాలెం వాగు మరమ్మతులు, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, మంచినీటి ట్యాంకు పనులను పరిశీలించి, ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. సోపిరాల గ్రామంలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ నాయకులు నరహరి శ్రీనివాసరావును ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి పి.గాలిదేవుడు, చీరాల మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణకిషోర్, కారంచేడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర, సాగర్ మిత్రులు వై.వెంకటేష్, కౌసల్యపలు శాఖల అధికారులు, టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

IN THE HIGH COURT OF JUDICATURE OF ANDHRA PRADESH
AT AMARAVATHI
A.S.No.1847 of 1995

Between :
Kothamasu Veera Raghavaiah (Died) & Others ... Appellants
And
Shaik Khajabi (Died) & Others ...Respondents

To,

27. Shaik Aphrishak W/o.Shaik Molali, R/o.Cherukupalli, Prakasam District
41. Earla Mala Kondaiah S/o.Late Narasimhaiah, Aged about 52 years, R/o.D.No. 9-4-25, Kamaraju Street, Near Indhiragandhi Statue, Kamaraju Street, VTC: Bapatla, Po.Bapatla, Bapatla District.
42. Erla Srinivasa Rao S/o.Narasimhaiah, Aged about 41 years, R/o.D.No.464, NTR center, Chilakaluripet, Guntur District. ...Respondent/Proposed Respondent No.37
43. Khaleel ahmed S/o.Shaik Mastan, Aged about 55 years, R/o.D.No.40-3-9A, Kalyanam Ramarao Street, Revenue Colony Park, Revenue Colony, Labbipet, Vijayawada, A.P.- 520010. ...Respondent/Proposed Respondent No.3
44. Nadipineni Seshamma W/o.Anjaneyulu, D/o.Narra Hanumatha Rao, Aged about 35 years, R/o.Penaka vari veedhi, Pamidipadu, Korisapadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.4
48. Kamma Kanthamma W/o.Late Kamma Mallikharjuna Rao, Aged About 60 years, R/o.at Garipati Towers, Ongole Road, Addanki Village, Bapatla District.
49. Kamma Siva Parvathi D/o.K.Mallikarjuna Rao, Aged about 40 years, R/o.Beside Municipality, Shivani Graphics, Addanki Village and Mandal, Bapatla District.
50. Subhashini W/o.Srinivasa Rao, D/o.K.Mallikarjuna Rao, Aged about 38 years, R/o.Ambadipudi Village, Ballikurava Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.8
51. Jujjuri Padma W/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 40 years, R/o.opp.Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet Palnadu District.
52. Geetha Leelavathi D/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 26 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District.
53. Jujjuri Prudhvi Kumar S/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 24 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District. ...Respondent/Proposed Respondent No.14
54. Shaik Subhani S/o.Late Shaik Khasim Bi, Aged about 45 years, Beside of Madipadu Mandal Office, Madipadu Village and Mandal, Bapatla District.
55. Shaik Suleman S/o.Late Shaik Khasim Bi, Aged about 43 years, Medical Shop, Thallur Road, Vellampalli Village, Madipadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.24
56. Shaik Adil S/o.Akram, Aged about 45 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
57. Shaik Akhil S/o.Akram, Aged about 43 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
58. Shaik Afill S/o.Akram Aged about 41 years, R/o.Kothapet, Vijayawada, Krishna District. ...Respondent/Proposed Respondent No.25
59. Shaik Abdul Rehaman S/o.Shaik Mastan Bi, Aged about 45 years, Occ. Tailer R/o.Vellampalli Village, Madipadu Manadal, Bapatla District.
60. Shaik Alla Bakshi S/o.Shaik Mastan Bi, Aged about 42 years, Occ.Teacher R/o Vellampalli Village, Madipadu Manadal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.26

Please take notice that the above appellants filed the above case against you, for your appearance in the above court, where you are requested to appear before the Honourable High Court, Amaravathi either personally or through an advocate on 15-09-2025 at 10.30 A.M. in the above said case, failing which the matter will be heard and determined in your absence on merits.

(By order of the Honourable Court)

KRUPA CHAND GOGINENI
VARUN CHOWDARY. GOGINENI
Advocates
Flat No 208, "A" Block, Capital Square Appt, Sai Bharthi Nagar, Koppuravuru, Kantaru cross Road, Guntur Dist:- 522507

నిద్రమత్తులో ఆర్టీసీ బస్సును ఢీకొట్టి..



చిల్లచెట్లలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

● 20 మందికి స్వల్ప గాయాలు

● సమయస్ఫూర్తితో వ్యవహరించిన డ్రైవర్

● త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల - పర్చూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. తెల్లవారుజాము సమయాన చీరాల డిపో నుంచి సుమారు 25 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు నరసరావుపేటకు బయలు దేరింది. కారంచేడు పరిసర ప్రాంతంకు వెళ్లేలోపే ఎదురుగా వస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్ డ్రైవర్ హైదరాబాదు నుంచి చీరాలకు వస్తూ నిద్ర మత్తులో ఆర్టీసీ బస్సుమీదుకు వచ్చాడు. అయితే సమయస్ఫూర్తిగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును వెంటను చిల్లచెట్ల వైపు మరల్చి వాహనాన్ని అదుపు చేశాడు. ఈక్రమంలో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న సుమారు 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. అప్పటి వరకు నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికులు సైతం ఒక్క సారిగా బస్ దిగి పరుగులు తీశారు. కొంత మందికి కళ్లల్లో బస్సుల అద్దం ముక్కలు గుచ్చుకున్నాయి. వెంటనే ఎవరికి వారు చీరాల్లోని పలు హాస్పిటల్లో చేరి చికిత్స పొందారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ధ్వంసమైన ప్రయివేట్ బస్సు ముందు భాగం



దాడి జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

వీఆర్వోపై దాడి పలువురిపై కేసు నమోదు

పర్చూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోపై పలువరు యువకులు దాడిచేసిన సంఘటనపై పర్చూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసునమోదు అయ్యింది. పర్చూరు మండలం గర్నెపూడికి చెందిన అల్లడి పోతురాజు చీరాల మండలం ఈపూరపాలెం సచివాలయం -4లో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం నుంచి ఈపూరుపాలెం వెళుతున్న ఆయనపై పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దాడి చేశారు.. పర్చూరుకు చెందిన సాతులూరి సుజీత్, జ్యోతి మహేష్, తానికొండ ఆజేయ్ కుమార్‌తోపాటు, మరో ఇద్దరు తనపై దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి జరిగిన ప్రాంతాన్ని ఎస్సై, ట్రైనీ ఎస్సై, వీర్వోల ఆధ్వర్యంలో పరిశీలించి వివరాలు సేకరించారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై దృష్టి

అద్దంకిటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని బాపట్ల జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న అన్నారు. బుధవారం స్థానిక సత్రం బడి ఆవరణంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జ్యోత్స్న పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 మున్సిపాలిటీలలో ఆటిజం సెంటర్లు మంజూరు అయ్యాయని, ఒక్కొక్క సెంటర్‌కు రూ. 27.75 లక్షలు మంజూరు అ యినట్లు తెలిపారు. అనంతరం కాన్పూర్ ఆలెంకో సంస్థ నుంచి వచ్చిన వైద్యులు ప్రియా వర్మ, తుషార్ వర్మలు వైకల్యం కలిగిన విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అర్హత కలిగిన వారికి ఉపకరణాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ మండల ఎంఈవో కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం. ధనలక్ష్మి, బాబురావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, ఫిజియోథెరపీస్ట్ ఇందిరా ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ముప్పవరం, 10.30 నిముషాలకు జాగర్లమూడివారిపాలెం, 11 గంటలకు కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామాలలో మంత్రి పర్యటించనున్నారు. అనంతరం 12 గంటలకు సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అతిథిగృహంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

రాష్ట్రంలో కక్ష సాధింపుల పాలన

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ప్రజా సమస్యలను గాలికి వదిలి వైసీపీ నేతలపై కక్ష సాధింపులకే సమయం కేటాయిస్తున్నదని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కావూరివారిపాలెం, దేశాయిపేట గ్రామాల్లో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యవసాయ కూలీకి పాముకాటు

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం పొలాల్లో పని చేస్తున్న మహిళ కూలీ పాము కాటుకు గురైంది. బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని హనుమంతు నగర్‌కు చెందిన శివపార్వతి సుమారు పది మందితో పనులకు వచ్చింది. ఈక్రమంలో ప్రమాదశాత్తు పాము కాటుకు గురి అయి స్పృహ కోల్పోగా సహ కూలీలు హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీలలో పనులు చేసే కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చి వారి భద్రతకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం బల్లికురవలో ఇటీవల జరిగిన క్వారీ ప్రమాదంపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కూలీలకు వెంటనే రూ.50 లక్షల పరిహారం అందించాలన్నారు. ప్రమాదంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడుకొండలు

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయిన ఘటన బుధవారం 16వ నెంబరు జాతీయరహదారిపై చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు, మధుబాబు అందించిన సమాచారం మేరకు ముండ్లమూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన జి.ఏడుకొండలు స్వగ్రామం నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రేణంగివరం వద్ద పొగాకు కంపెనీ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి ఢీకొనడంతో గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు.

రామాంజనేయపురంలో చోరీ

● రైతు ఇంట్లో బంగారు, వెండి వస్తువుల అపహరణ

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోరీజరిగింది. గుంటుపల్లి గురుమూర్తి అను రైతు ఇంటి బయట నిద్రిస్తుండగా వెనక వైపు నుంచి ఇంట్లోకి వచ్చిన దొంగలు బీరువాలో ఉన్న మూడు సవర్ల బంగారు వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు, పది హేను వందల నగదును తస్కరించారు. బుధవారం ఉదయం ఇంట్లోకి వెళ్లిన గురుమూర్తి లోపల బీరువా తెరిచి ఉండటం చూసి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే బల్లికురవ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజులు పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన బీరువా వద్ద వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు చదువులలో రాణించాలి : ఆర్‌జేడీ

అద్దంకిటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే వసతులను విద్యార్థులు సద్వినియోగపర్చుకుని చదువులో రాణించాలని ఆర్‌జేడీ పద్మావతి అన్నారు. బుధవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థుల స్వాగతం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేస్తుందని, దానిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ప్రతి రోజు కాలేజీకి వచ్చి హాజరు శాతాన్ని పెంచుకోవాలన్నారు. ముందుగా అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారిన సిలబస్‌కు అనుకూలంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. అధ్యాపకులు ఉదయం సాయంత్రం విధిగా ఎఫ్ఆర్ఎస్ వేయాలన్నారు. సిలబస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. స్వాగత కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యు. కోటేశ్వరమ్మ, కె. రాజేశ్వరమ్మ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి, అధ్యాపకులు బుజ్జిబాబు, ఆనంద్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

అద్దంకిటౌన్: సేంద్రియ సాగు ద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ పడని రైతులు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏఈవో కోటేశ్వరరావు,వీఏఏలు సీత, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము, ఇంకొల్లు మండలం, ఇంకొల్లు
బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం: 05/2025 తేదీ: 05-08-2025.

ఇంకొల్లు మండలం, ఇంకొల్లు గ్రామ పంచాయితీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ రూములు మరియు ఖాళీ స్థలములను ది.1-08-2025 నుండి ది.31-3-2027వరకు లీజుకు ఇచ్చుటకు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు శ్రీయుత డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇంకొల్లు వారి సమక్షమున తేది. 11-08-2025న ఉదయం 10.00 గంటలకు ఈ క్రింది తెలిపిన ఖాళీ స్థలములను వరస క్రమములో బహిరంగ వేలం పాట నిర్వహించబడును. పాటలో పాల్గొనువారు ఈ క్రింది తెలిపిన విధముగా డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవలయును. గ్రామ పంచాయితీకి ఏ విధమైన బాకీ ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనరు లు. అనివార్య కారణముల వలన వేలం పాట వాయిదా వేయుటకు గాని పాట రద్దు చేయుటకు గాని వేలంపాట నిర్వహణ అధికారి గారికి అధికారము కలదు. మిగిలిన విషయములు ఆఫీసు వేళలయందు అడిగి తెలుసుకొనవలయును.

వ. నెం.	వేలం వివరములు	లీజు కాలము	దాఖల చేయవలసిన ఆస్థి విలువ ధృవీకరణ పత్రం	డిపాజిట్
1.	షాపింగ్ కాంప్లెక్స్ రూములు నెం:1,2,3,4,5,6	ది:01-08-2025 నుండి ది:31-03-2027 వరకు	1,00,000/-	50,000/-
2.	షాపింగ్ కాంప్లెక్స్ నుండి బస్టాండ్ గేటు వరకు గల ఖాళీ స్థలములు: 1,2,3,4,5,6	ది:01-08-2025 నుండి ది:31-03-2027 వరకు	1,00,000/-	50,000/-
3.	బస్టాండ్ గేటు నుండి మసీదు వరకు గల ప్లాటులు నెం. 1,2,3,4,5,6,7	ది:01-08-2025 నుండి ది:31-03-2027 వరకు	1,00,000/-	50,000/-

కె.రామసుబ్బారెడ్డి, పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ, ఇంకొల్లు